
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
కృష్ణా జిల్లా వార్తలు
బుధవారం 26 నవంబరు 2025




ఇప్పటికింతే..!

గన్నవరం, పెనమలూరు, నూజివీడు, కైకలూరుపై నిర్ణయం వాయిదా

ఉమ్మడి కృష్ణా సంగతి తాను చూసుకుంటానన్న సీఎం చంద్రబాబు

ఎన్టీఆర్, కృష్ణాజిల్లాల్లో నియోజకవర్గాల చేర్పులు, మార్పులు ప్రస్తుతానికి లేనట్టే. గత కొద్ది రోజులుగా ఎడతెగని చర్చకు దారితీసిన ఈ అంశాలను ప్రభుత్వం తాత్కాలికంగా పక్కన పెట్టింది. ఉమ్మడి కృష్ణాజిల్లాలోని నియోజకవర్గాల విలీన అంశాలను తాను చూసుకుంటానని మంత్రులకు సీఎం చంద్రబాబు చెప్పినట్టు తెలిసింది. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఎవరికీ ఇబ్బంది కలగకుండా ఉండటంతో పాటు రానున్న జనగణన, నియోజకవర్గాల పునర్విభజన సమయంలో ఈ చేర్పులు, మార్పుల అంశాలను చూద్దామన్నట్టు సమాచారం. దీంతో ఎన్టీఆర్, కృష్ణా జిల్లాలు యథాతథంగానే ఉండనున్నాయి. స్థానిక ప్రజా ప్రతినిధులు 'ఎవరిదారి వారిది' అన్నట్టుగా వ్యవహరించటం కూడా ఈ పరిస్థితికి కారణంగా తెలుస్తోంది.

స్థానిక సంస్థల ఎన్నికలు, జనగణన తర్వాతే నిర్ణయం ● నియోజకవర్గాల పునర్విభజన సందర్భంలో అంతిమ నిర్ణయం తీసుకునే అవకాశం



(ఆంధ్రజ్యోతి, విజయవాడ): గత వైసీపీ ప్రభుత్వంలో అసంపూర్తిగా జిల్లాల విభజన జరిగింది. దీనిపై అప్పట్లోనే ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో నాటి ప్రభుత్వం తప్పులను సరిదిద్ది, ప్రజల అభీష్టం మేరకు చేర్పులు, మార్పులు చేసేందుకు కూటమి ప్రభుత్వం కేబినెట్ సబ్ కమిటీని ఏర్పాటు చేసింది. ఆయా నియోజకవర్గాలలోని ప్రజలు, నాయకులు, ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో మంత్రుల కమిటీకి తమ అభిప్రాయాలతో కూడిన అభ్యర్థనలను అందజేశారు. ప్రజాభీష్టం ఒకలా ఉంటే.. ప్రజా ప్రతినిధుల అభిప్రాయాలు మరోలా ఉండటం ముఖ్యమంత్రికి ఆగ్రహం తెప్పించింది. ఇలాంటి పరిస్థితుల్లో గందరగోళానికి తావివ్వకూడదని సీఎం చంద్రబాబు భావిస్తున్నట్టు సమాచారం. అందుకే కేబినెట్ సబ్ కమిటీ మంత్రులతో ఉమ్మడి కృష్ణాజిల్లా వ్యవహారం తాను చూసుకుంటానని గట్టిగా చెప్పినట్టు తెలిసింది. దీంతో గన్నవరం, పెనమలూరు, నూజివీడు నియోజకవర్గాలను ఎటు కలపాలన్న అంశాన్ని భవిష్యత్తులో ముఖ్యమంత్రే నిర్ణయించనున్నారు. ప్రస్తుతానికి అయితే నియోజకవర్గాల మార్పులు, చేర్పుల అంశాన్ని తాత్కాలికంగా పక్కన పెట్టేశారు.

గన్నవరం, పెనమలూరు నియోజకవర్గాలను ఎన్టీఆర్ జిల్లాలో కలపాలన్న డిమాండ్ రావటానికి ప్రధాన కారణాలలో విజయవాడ గ్రేటర్ అంశం కూడా ఉంది. గన్నవరం, పెనమలూరు నియోజకవర్గాలు గ్రేటర్ విజయవాడ ప్రతిపాదిత జాబితాలో ఉన్నాయి. గన్నవరం నియోజకవర్గంలో గన్నవరం మండలం, విజయవాడ రూరల్ మండలం, పెనమలూరు నియోజకవర్గంలో పెనమలూరు, కంకిపాడు మండలాల పరిధిలోని గ్రామాలు గ్రేటర్ విజయవాడ విలీన ప్రతిపాదన జాబితాలో ఉన్నాయి. రాజధాని అమరావతి ప్రాంత పరిధిలో గుంటూరు, విజయవాడ భవిష్యత్తులో జంట నగరాలుగా అభివృద్ధి చెందుతూ అమరావతితో అనుసంధానం కావటానికి అవకాశం ఉంది. ఈ రెండు నగరాలతో కూడా కలిపి అమరావతి సీఆర్‌డీఏ పరిధిలో అతిపెద్ద రాజధానిగా అవతరించటం జరుగుతుంది. కాబట్టి ఈ రెండు నగరాల అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని గ్రేటర్ విజయవాడ చేయాలన్నది ప్రభుత్వ ఉద్దేశ్యంగా కనిపిస్తోంది. గ్రేటర్ విజయవాడకు సంబంధించిన ప్రతిపాదనలను ప్రభుత్వం ఎన్టీఆర్ జిల్లా అధికార యంత్రాంగాన్ని కోరింది. మొత్తం 75 గ్రామాలతో కూడిన ప్రతిపాదనలను ప్రభుత్వానికి వారు నివేదించారు. దీనిపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోవటమే మిగిలి ఉంది. స్థానిక సంస్థల ఎన్నికలకు ముందే ప్రభుత్వం గ్రేటర్ విజయవాడపై కీలక నిర్ణయం తీసుకునే అవకాశం కనిపిస్తోంది. నియోజకవర్గాలు వేర్వేరు జిల్లాల్లో ఉన్నప్పటికీ కూడా విశాఖ తరహాలో గ్రేటర్ విజయవాడ దిశగా ప్రభుత్వం ఆలోచనలు ఉన్నట్టుగా తెలుస్తోంది.

గ్రేటర్ విజయవాడ తర్వాత స్పష్టత వచ్చే అవకాశం!

డివిజన్లలో మార్పుల్లేవ్

కొత్త జిల్లాలు, రెవెన్యూ డివిజన్లను ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో ఉమ్మడి కృష్ణా జిల్లాకు సంబంధించి డివిజన్ల మార్పులు జరగలేదు. దీనిని బట్టి చూస్తే.. ప్రస్తుతానికి ఎన్టీఆర్, కృష్ణా జిల్లాలలో ఎలాంటి మార్పులు చేసే అవకాశం లేదన్న సంకేతాలు వెలువడ్డాయి. గన్నవరం, పెనమలూరు నియోజకవర్గాలను విలీనం చేయాలనుకుంటే.. గన్నవరం రెవెన్యూ డివిజన్‌ను కొత్తగా ఏర్పాటు చేసేవారు. అలాంటిదేమీ లేకపోవటంతో ఈ రెండు నియోజకవర్గాలను విలీనం చేసే ఉద్దేశ్యం ప్రస్తుతానికి లేదన్నది అర్థమవుతోంది.

ఆ మూడు నియోజకవర్గాలపై ఇప్పటికీ ఆశలు

నూజివీడు నియోజకవర్గాన్ని ఎన్టీఆర్ జిల్లాలో కలపాలన్న అంశంపై తాను పరిశీలించి న్యాయం చేస్తానని ఎన్నికల ముందు చంద్రబాబు హామీ ఇచ్చారు. గన్నవరం, పెనమలూరు నియోజకవర్గాలను మాత్రమే కలిపితే కొత్త రెవెన్యూ డివిజన్ అవసరం అవుతుంది. అదే నూజివీడు నియోజకవర్గాన్ని కూడా కలిపితే అవసరం ఉండదు. ఎందుకంటే నూజివీడు వేరే జిల్లాలో ఉన్నా.. రెవెన్యూ మిగతా 6లో..

ఈవోటీలు ఇవ్వండి ప్లీజ్!

జలవనరుల శాఖకు కాంట్రాక్టర్ల దరఖాస్తు

- విజిలెన్స్ అధికారులు రంగంలోకి దిగడంతో పరుగులు
- టెండర్లు దక్కించుకుని ఇన్నాళ్లూ పనులు చేయని కాంట్రాక్టర్లు
- ఆ వివరాలు అడిగిన విజిలెన్స్ అధికారులు
- ఇప్పటి వరకు రికార్డులు ఇవ్వని ఇరిగేషన్ శాఖ



(ఆంధ్రజ్యోతి - విజయవాడ): జలవనరుల శాఖలో వివిధ పనుల టెండర్లను దక్కించుకున్న కాంట్రాక్టర్లలో చలనం వచ్చింది. ఇంతకాలం పనుల జోలికి వెళ్లకుండా కాలం గడుపుతూ వచ్చిన వారికి ఇప్పుడు అకస్మాత్తుగా టెండర్లు గుర్తుకొచ్చాయి. ఏళ్లపాటు టెండర్లలో పేర్కొన్న పనులను వదిలేసిన కాంట్రాక్టర్లు ఆగమేఘాల మీద పనులు మొదలుపెడుతున్నారు. జలవనరుల శాఖ అధికారులు షోకాజ్ నోటీసులు ఇచ్చినందుకో, వారిని బ్లాక్‌లిస్టులో పెడతారన్న భయంతో ఈ పనులు చేయడం లేదు. ఉన్నట్టుండి ఈ పనులు ప్రారంభం కావడానికి అసలు కారణం విజిలెన్స్ విభాగం. కృష్ణాజిల్లాలో జలవనరుల శాఖ ప్రతిపాదించిన పనులను తనిఖీ చేయాలని విజిలెన్స్‌కు గుడివాడ నియోజకవర్గానికి చెందిన అధికార పార్టీ నేత ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. దీనిపై విజిలెన్స్ అధికారులు స్పందించారు. ఈ ఏడాది ప్రతిపాదించిన పనులు, వాటి కోసం పిలిచిన టెండర్లు, పనులను దక్కించుకున్న కాంట్రాక్టర్ల వివరాలను అందజేయాలని విజిలెన్స్ అధికారులు జలవనరుల శాఖ అధికారులకు లేఖ పంపారు. ఇప్పటి వరకు జలవనరుల శాఖలో ఇంజనీరింగ్ అధికారులు ఈ లేఖపై స్పందించలేదు. విజిలెన్స్ అధికారులు అడిగిన రికార్డులను ఇవ్వలేదు.

నిబంధనలకు నీళ్లు..

ఏ శాఖలో అయినా టెండరును దక్కించుకున్న తర్వాత కాంట్రాక్టర్ ఆ పనిని నిర్ణీత గడువులోపు పూర్తి చేయాలి. ఈ గడువు లోపు పనిని పూర్తి చేయకపోతే ఆ శాఖ అధికారులకు దరఖాస్తు చేసుకోవాలి. ఈవోటీ (ఎక్స్‌టెన్షన్ ఆఫ్ టైం) ఇవ్వాలని దరఖాస్తు చేసుకోవాలి. ఈ గడువు పెంపును ఏ కారణంగా కోరుతున్నారో తెలియజేయాలి. ప్రస్తుతం జలవనరుల శాఖలో మిగతా 6లో..

అంతరాలయ దర్శనం చేసుకుని బయటకు వస్తున్న భక్తులతో మాట్లాడుతున్న ఆలయ చైర్మన్ రాధాకృష్ణ, ఈవో శీనానాయక్



ఉచిత క్యూలైన్ భక్తులకు అంతరాలయ దర్శనం

6

- దుర్గగుడిలో ట్రయల్ నిర్వహించిన అధికారులు
- దేవదాయ కమిషనర్‌తో చర్చించి అమలు ఎప్పటి నుంచో ప్రకటిస్తాం

క్రీడలతో మానసిక, శారీరక వికాసం

- త్వరలోనే జాతీయస్థాయి క్రీడలకు వేదికగా మచిలీపట్నం
- రాష్ట్ర స్థాయి బాల్ బాడ్మింటన్ పోటీలను ప్రారంభించిన ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల 8



కోలుకోలేని దెబ్బ!

మొంథా తుఫానుతో అరటికి అపార నష్టం

జిల్లాలో 2,500 హెక్టార్లలో సాగు

- గెలలు తయారై కోతకు సిద్ధమైన తరుణంలో వచ్చిన తుఫాను
- కూలిపోయిన చెట్లు.. తొలగిం చేందుకు నేడు తప్పని వ్యయం
- ఒక్కో ఎకరానికి మొత్తంగా రూ.60 వేల నుంచి రూ.70 వేల వరకు ఖర్చు
- ప్రభుత్వం ప్రకటించిన సాయం రూ.10 వేలే..
- దిక్కుతోచని స్థితిలో రైతన్నలు

అరటి తోటలో విరిగిపడిన చెట్లు(ఫైల్)



ఇటీవల వచ్చిన మొంథా తుఫాను అరటి రైతులను కోలుకోలేని దెబ్బతీసింది. కష్టపడి పండించిన పంట చేతికి అందివచ్చే వేళ తోటలను సర్వనాశనం చేసింది. అపార నష్టం కలుగజేసింది. ఎక్కడికక్కడ కూలిపోయిన చెట్లను తొలగించి భూమిని మరో పంటకు సిద్ధం చేసుకునేందుకు అన్నదాతలు నేడు వ్యయ ప్రయాశ పడాల్సి వస్తోంది. ఒక్కో ఎకరానికి రూ.70 వేల వరకు పెట్టుబడి పెట్టిన రైతులకు ప్రభుత్వం ఇచ్చే రూ.10వేల సాయం సరిపోదని, మరింత పరిహారం ఇవ్వాలని కోరుతున్నారు.

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం: కృష్ణా నది తీరం వెంబడి ఉన్న తోట్లవల్లూరు, పెనమలూరు, కంకిపాడు, ఉయ్యూరు, ఘంటసాల, చల్లపల్లి, మోపిదేవి, అవనిగడ్డ తదితర మండలాల్లో సుమారు 2,500 హెక్టార్లకు పైగా అరటి సాగు చేశారు. గత అక్టోబరులో సంభవించి మొంథా తుఫాను కారణంగా గంటకు 90 కిలో మీటర్ల వేగంగా గాలులు వీచాయి. దీంతో అరటి గెలలు తయారయ్యే దశలో ఉన్న అధిక శాతం మిగతా 6లో..

ఎకరానికి ఇచ్చే పరిహారం రూ.10 వేలే..

వాణిజ్య పంట అయిన అరటి తోటల సాగుకు ప్రభుత్వం ఇచ్చే నష్టపరిహారం ఎకరానికి కేవలం రూ.10 వేలు మాత్రమేనని రైతులు, అధికారులు చెబుతున్నారు. వరి పంటకు ఎకరానికి రూ.40 వేలు ఖర్చవుతుందని, అరటి సాగుకు రూ.60 వేల నుంచి రూ.70వేల వరకు పెట్టుబడిగా పెట్టాలని, కానీ వరి పంట మాదిరిగానే అరటి తోటలకు ఎకరానికి రూ.10వేలు మాత్రమే పరిహారం నిర్ణయించడం ఎంతవరకు సబబు అని రైతులు ప్రశ్నిస్తున్నారు. పరిహారాన్ని పెంచాలని డిమాండ్ చేస్తున్నారు.



ర్యాగింగ్ భూతం!

సిద్ధార్థ మెడికల్ కాలేజీలో రెచ్చిపోతున్న సీనియర్లు

ముప్పై మందికి పైగా జూనియర్లకు వేధింపులు

- కాళ్లు పట్టాలి.. మెస్ నుంచి భోజనం తేవాలి
- ఎంగిలి ప్లేట్లు కడగాలి.. వారానికి ఒక రోజు దుస్తులు ఉతకాలి
- ఎవరికైనా ఫిర్యాదు చేస్తే శిక్షలు కఠినంగా ఉంటాయని హెచ్చరికలు
- మాట వినని వారికి హాస్టల్ గదిలో నిర్బంధం
- తల్లిదండ్రులకు చెప్పుకుని బాధపడిన పలువురు విద్యార్థులు
- వారి ఫిర్యాదుతో విషయం వెలుగులోకి..
- రంగంలోకి దిగిన పోలీసులు.. యాంటీర్యాగింగ్‌పై అవగాహన సదస్సులు

విజయవాడ, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): సిద్ధార్థ మెడికల్ కాలేజీలో ర్యాగింగ్ పేరుతో సీనియర్ విద్యార్థులు జూనియర్లను వేధించడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. భవిష్యత్తులపై కోటి ఆశలతో కళాశాలకు వచ్చిన విద్యార్థులను తాము ఏ పని చెప్పినా చేయాలని, లేదంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని సీనియర్లు బెదిరింపులకు పాల్పడుతున్నట్టు సమాచారం. ముఖ్యంగా హాస్టల్ మెస్‌లో వేధిస్తున్నారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. తరగతులకు వెళ్లే ముందు, తరగతులు అయిపోయిన తర్వాత కొంతమంది జూనియర్లు కచ్చితంగా సీనియర్ల రూమ్‌కు వెళ్లాల్సిందేనని, లేదంటే మరుసటి రోజు మెస్‌లో బెదిరించి మిగతా 6లో..

ఎల్లో అలెర్ట్ జారీ

ఉమ్మడి కృష్ణాజిల్లాకు సెన్యార్ తుఫాను ముప్పు

- హెచ్చరికలు జారీ చేసిన వాతావరణశాఖ
- ముమ్మరంగా కొనసాగుతున్న వరి కోతలు
- తుఫాను హెచ్చరికలతో అన్నదాతల్లో కలవరం

ఇబ్రహీంపట్నం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): సెన్యార్ తుఫాను హెచ్చరికల నేపథ్యంలో రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాలకు ఎల్లో అలెర్ట్‌ను జారీ చేసింది. భారీ వర్షాలు పడే అవకాశం ఉందని హెచ్చరించింది. ఇప్పటికే అధిక వర్షాలు, మొంథా తుఫానుతో తీవ్రంగా నష్టపోయిన అన్నదాతలు మరో తుఫాను హెచ్చరికలతో కలవరపడుతున్నారు. రెండు జిల్లాలో ప్రస్తుతం ముమ్మరంగా వరి కోతలు కొనసాగుతున్నాయి. ఇప్పటికే ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో విక్రయించేందుకు కల్లాల్లో ఆరబోసి ఉంచారు. తేమ శాతం నిబంధనలు, ధాన్యం రవాణా చేసే వాహనాలకు జీపీఎస్ ట్యాగింగ్ నిబంధనల కారణంగా రైతులు ధాన్యాన్ని సకాలంలో అమ్ముకోలేని పరిస్థితి నెలకొంది. మరో పక్క గోనె సంచుల కొరత వేధిస్తోంది. తుఫాను హెచ్చరికల నేపథ్యంలో కోతకు సిద్ధంగా ఉన్న పంటను కోసేందుకు రైతులు హడావిడి పడటంతో కోత యంత్రాలకు డిమాండ్ బాగా పెరిగి, అవి దొరకని పరిస్థితి నెలకొంది. మరో పక్క వర్షాలు పడితే కల్లాల్లో ధాన్యం తడవకుండా పట్టాలను సిద్ధం చేసుకున్నారు. మంగళవారం ఆకాశం మేఘావృతం కావడంతో అన్నదాతలు పరుగులు పెట్టారు. ఈ సమయంలో తుఫాను వస్తే చేతికొచ్చిన పంట అందకుండా పోతుందని ఆవేదన చెందుతున్నారు.

యూపీఎస్సీ శిక్షణ!

బీసీ సంక్షేమశాఖ తీరుపై విమర్శలు

- యూపీఎస్సీ ప్రిలిమనరీ ఎగ్జామినేషన్స్ ఉచిత శిక్షణకు దరఖాస్తుల స్వీకరణ
- అర్హులైన ప్రతి ఒక్కరికీ శిక్షణ ఇవ్వాలన్నది ప్రభుత్వ ఉద్దేశ్యం
- అభ్యర్థులకు అనుకూలంగా సోషల్ వెల్ఫేర్.. ప్రతిబంధకంగా బీసీ వెల్ఫేర్ నిబంధనలు
- ఆదాయ పరిమితులు, కుల రిజర్వేషన్లు, గడువు తేదీలపై అభ్యర్థుల అసంతృప్తి
- ప్రచారం నిర్వహించని బీసీ వెల్ఫేర్.. అభ్యర్థుల నుంచి స్పందన కరవు



(ఆంధ్రజ్యోతి, విజయవాడ): ఉన్నత విద్య కోసం ప్రభుత్వం అందించే ఉచిత శిక్షణ విషయంలో సంక్షేమ శాఖలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయి. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఉచిత శిక్షణ ఇవ్వాలన్నది ప్రభుత్వ విధానం కాగా.. అందుకు విరుద్ధంగా ఆయా శాఖలు ప్రవర్తిస్తున్నాయి. యూనియన్ పబ్లిక్ సర్వీసెస్ (యూపీఎస్సీ) ప్రిలిమనరీ ఎగ్జామినేషన్స్ - 2026కు ఉచిత శిక్షణ ఇవ్వటం కోసం ఔత్సాహిక అభ్యర్థుల నుంచి దరఖాస్తుల ఆహ్వానం విషయంలో బీసీ వెల్ఫేర్ అనుసరిస్తున్న విధానాలపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. సోషల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ అనుసరిస్తున్న విధానానికి, బీసీ వెల్ఫేర్ అనుసరిస్తున్న విధానాలకు తేడా ఉండటంతో ఔత్సాహిక దరఖాస్తుదారుల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సోషల్ వెల్ఫేర్ అన్నివర్గాలను దృష్టిలో పెట్టుకుని రిజర్వేషన్లు ప్రకటించగా.. బీసీ వెల్ఫేర్ మాత్రం తన దారి వేరన్నట్టుగా వ్యవహరిస్తోంది. ఆదాయ పరిమితుల విషయంలో కూడా బీసీ వెల్ఫేర్ విధానాలు ఆగ్రహాన్ని తెప్పిస్తున్నాయి. ఉమ్మడి కృష్ణాజిల్లాలో అటు సోషల్ వెల్ఫేర్ నిర్దేశించిన నిబంధనలకు, ఇటు బీసీ వెల్ఫేర్ నిర్దేశించిన నిబంధనలకు ఎంతో వ్యత్యాసం ఉంటోంది.

సోషల్ వెల్ఫేర్ మార్గదర్శకాలు భేష్

యూపీఎస్సీ సివిల్స్ ప్రిలిమినరీ పరీక్షలు - 2026కు ఉచిత శిక్షణ అందించేందుకు సోషల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ మార్గదర్శకాలు ఆమోదయోగ్యంగా ఉన్నాయని దరఖాస్తుదారులు అంటున్నారు. జనరల్ స్టడీస్ (పేపర్ - 1), సీఎస్ఏటీ (పేపర్ - 2), ప్రింటెడ్ స్టడీ మెటీరియల్ వంటివి ఉచితంగా అభ్యర్థులకు మిగతా 6లో..

ఉన్నత విద్య కోసం అభ్యర్థులకు ప్రభుత్వం అందించే ఉచిత శిక్షణ విషయంలో బీసీ సంక్షేమ శాఖ వ్యవహరిస్తున్న తీరు పలు విమర్శలకు దారితీస్తోంది. సాంఘిక సంక్షేమ శాఖ నిబంధనలకు పూర్తి భిన్నంగా నిబంధనలు ప్రవేశపెట్టి అభ్యర్థులను అసంతృప్తికి గురి చేస్తోంది. సరైనా ప్రచారం నిర్వహించకుండా, దరఖాస్తుల స్వీకరణ గడువు తక్కువగా విధించి ఉచిత శిక్షణకు ఔత్సాహికులను దూరం చేస్తోందని విమర్శలు వ్యక్తమవుతున్నాయి.



ధాన్యం.. దైన్యం

- గ్రామాల్లో పేరుకుపోయిన ధాన్యం నిల్వలు
- కాటాలు వేసి వారం రోజులుగా లారీల కోసం ఎదురుచూపులు 8
- చేతులెత్తేసిన రైతు సేవా కేంద్రం నిర్వాహకులు
- వాయుగుండం వార్తలతో రైతుల గుండెల్లో గుబులు



6

వైభవంగా సుబ్రహ్మణ్య షష్టి మహోత్సవాలు ప్రారంభం



ఉచిత క్యూ భక్తులకు అంతరాలయ దర్శనం కల్పిస్తున్న చైర్మన్, ఈవో

దుర్గమ్మ భక్తులకు ఉచిత అంతరాలయ దర్శనం

- ట్రయల్ నిర్వహించిన ఆలయ అధికారులు
- సాధ్యాసాధ్యాలు పరిశీలించి త్వరలో నిర్ణయం

ఇంద్రకీలాద్రి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మను ఉచిత క్యూలో దర్శనం చేసుకునే భక్తులకు అంతరాలయంలో అమ్మవారిని దర్శించుకునే మహద్భాగ్యం కలిగింది. దుర్గగుడి చైర్మన్ రాధాకృష్ణ (గాంధీ) ఈవో శీనానాయక్‌లు వినూత్న ఆలోచనతో మంగళవారం కార్యాచరణను ఖరారు చేశారు. దీంతో సాయంత్రం 3



నుంచి 4 గంటల మధ్య ఉచిత క్యూలో భక్తులకు అమ్మవారి అంతరాలయ దర్శన భాగ్యం లభించింది. ఆలయ చైర్మన్ రాధాకృష్ణ, ఈవో శీనానాయక్, టెంపుల్ ఏఈవో వెంకటరెడ్డితో పాటు సంబంధిత సిబ్బంది ఇందుకు తగిన ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ, టికెట్లు కొనలేని భక్తులకు అంతరాలయ దర్శనం కల్పిస్తే ఎలా ఉంటుందన్నదానిపై అధ్యయనం చేసేందుకు మంగళవారం సాయంత్రం గంటపాటు ఉచిత క్యూలో భక్తులకు అవకాశం కల్పించినట్టు చెప్పారు. టికెట్ దర్శనం చేసుకునే భక్తులు, వీఐపీలు తదితర ముఖ్యులకు ఇబ్బంది లేకుండా ఉచిత క్యూలో భక్తులకు అంతరాలయ దర్శనం ఏమేరకు చేయించవచ్చనే దానిపై దేవదాయశాఖ కమిషనర్‌తో చర్చించి ఎప్పటి నుంచి అమలు చేసేది నిర్ణయం తీసుకుంటామన్నారు. ఈవో శీనానాయక్ మాట్లాడుతూ, అంతరాలయంలో అమ్మవారిని దర్శించుకున్న భక్తులు మధురానుభూతి చెందారని, వారి మనోభావాలు వింటుంటే ఎంతో ఆనందంగా ఉందన్నారు.



ఈవో, చైర్మన్ సమక్షంలో వెండి వస్తువులు అందజేస్తున్న దాతలు

దుర్గమ్మకు 7.37 కిలోల వెండి వస్తువుల కానుక

ఇంద్రకీలాద్రి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మకు ప్రకాశంజిల్లా చీమకుర్తికి చెందిన మారం కుటుంబసభ్యులు మంగళవారం ఈవో శీనానాయక్ ద్వారా రూ.12 లక్షల విలువగల 7.37 కిలోల వెండి వస్తువులను కానుకగా అందజేశారు.

బంగారు సూత్రాల హారం కానుక..

చిత్తూరుకు చెందిన భక్తురాలు లక్ష్మీశిల్ప మంగళవారం రూ.3.50 లక్షల విలువగల 27 గ్రాముల మంగళ సూత్రాల హారాన్ని అమ్మవారికి కానుకగా సమర్పించారు. దాతలకు ఈవో శీనానాయక్ ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించారు. అనంతరం వేదఆశీర్వచనం, ప్రసాదం, శేషవస్త్రం, అమ్మవారి చిత్రపటం అందజేశారు.

అన్నవితరణకు విరాళం..

దివంగత నేత దేవినేని రాజశేఖర్ (నెహ్రూ) పేరిట మంగళవారం ఆయన కుమారుడు దేవినేని అవినాశ్, సతీమణి సుధీరతో కలిసి అన్న వితరణ నిమిత్తం రూ 1,01,116 విరాళంగా అందజేశారు.



కనకదుర్గమ్మను కొలిచిన విదేశీభక్తులు

ఇంద్రకీలాద్రి : ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మను పలువురు విదేశీ భక్తులు మంగళవారం దర్శించుకున్నారు. అమెరికా, రష్యాకు చెందిన ఏడుగురు భక్తులు రూ.500 రుసుం టికెట్ కొనుగోలు చేసి అంతరాలయం ద్వారా అమ్మవారిని దర్శించుకున్నారు. ఈవో శీనానాయక్ వారికి ఆలయ మర్యాదలు కల్పించారు.



స్వామివార్లకు పట్టువస్త్రాలు సమర్పిస్తున్న బుద్దప్రసాద్, విజయలక్ష్మి దంపతులు

వైభవంగా సుబ్రహ్మణ్య షష్ఠి మహోత్సవాలు



మోపిదేవి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి షష్ఠి కళ్యాణ మహోత్సవాలు మంగళవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. అనువంశిక ధర్మకర్తలైన చల్లపల్లిరాజా వంశీయులు, దేవదాయశాఖ అధికారుల తరపున ఎమ్మెల్యే మండలి బుద్దప్రసాద్, విజయలక్ష్మి దంపతులు శ్రీ స్వామివార్లకు పట్టువస్త్రాలు సమర్పించారు. ఈవో దాసరి శ్రీరామవరప్రసాదరావు ఆధ్వర్యంలో అర్చక బృందం విశేష పూజలు నిర్వహించారు. శ్రీ స్వామివార్లను పెండ్లి కుమారుడిని చేయుటతో షష్ఠి కళ్యాణ మహోత్సవాలు ప్రారంభమయ్యాయి. ప్రధాన అర్చకులు బుద్దు పవన్‌కుమార్ శర్మ, వేదపండితులు కొమ్మూరి ఫణికుమార్ శర్మ బ్రహ్మత్వంలో అర్చక బృందం స్వామివారిని పెండ్లి కుమారుడిని చేయు ఘట్టాన్ని శాస్త్రోక్తంగా జరిపారు. భక్తులు పెద్దఎత్తున స్వామివార్లను దర్శించుకున్నారు. అనంతరం సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానం, చల్లపల్లి ఎస్టేట్ దేవాలయాల ఆధ్వర్యంలో ముద్రించిన 2026 ఆంగ్ల నూతన సంవత్సర క్యాలెండర్‌ను మంగళవారం ఉదయం ఎమ్మెల్యే మండలి బుద్దప్రసాద్ ఆవిష్కరణ చేశారు.

కృష్ణాజిల్లాను ప్రథమ స్థానంలో నిలిపేందుకు కృషి చేయాలి : డీఎంహెచ్‌వో

మచిలీపట్నం టౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : రోగులకు సకాలంలో వైద్యసేవలందించడంలోనూ, గర్భిణీలు, పిల్లలకు టీకాలు వేయడంలో కృష్ణాజిల్లాను ప్రథమ స్థానంలో నిలిపేందుకు అందరూ కృషి చేయాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి పి. యుగంధర్ సూచించారు. మంగళవారం డా. యుగంధర్ నిర్వహించిన సమావేశంలో జాతీయ ఆరోగ్య కార్యక్రమాల పనితీరుపై సమీక్షించారు. వైద్యులతో పాటు సిబ్బంది సకాలంలో హాజరు కావాలన్నారు. ప్రజారోగ్య కార్యక్రమాలను ఆశించిన లక్ష్యాల మేరకు పూర్తి చేయాలన్నారు. ఏవిధమైన నిర్లక్ష్యం చేయకుండా, పనితీరులో లోపాలు లేకుండా విధులు నిర్వహించాలన్నారు.

రాజ్యాంగ ఫలాలు అందరికీ అందాలి

- మహిళా కమిషన్ చైర్‌పర్సన్ శైలజ



జీవిత సాఫల్య పురస్కారాలు, అవార్డులతో ప్రముఖులు, చిత్రంలో మహిళా కమిషన్ చైర్‌పర్సన్ శైలజ

విజయవాడ సిటీ, నవంబరు 25(ఆంధ్రజ్యోతి) : వికసిత్ భారత్‌లో భాగంగా రాజ్యాంగ ఫలాలను అందరికీ అందించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటున్నాయని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజ అన్నారు. రాజ్యాంగ పరిరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏపీ, తెలంగాణలోని పలు రంగాల్లో ప్రతిభ కనబర్చిన ప్రముఖులకు జీవిత సాఫల్య పురస్కారాలు, అవార్డులు అందజేశారు. పాన్‌ఇండియన్ సోషియో కల్చర్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యాన నగరంలోని ఓ హోటల్‌లో జరిగిన కార్యక్రయానికి శైలజ ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే సంక్షేమ పథకాలు ప్రజలకు ఎంతో మేలు చేస్తున్నాయన్నారు. కూటమి ప్రభుత్వం అమలు చేసిన స్త్రీ పథకం మహిళలకు దోహదపడుతుందన్నారు. మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎమ్మెల్సీ సోము వీర్రాజు మాట్లాడుతూ, ఆర్థిక వృద్ధి, సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు, మౌలికసదుపాయాలు, సామాజిక సంక్షేమం, సులభతర వ్యాపారం, జీవనం వంటి వాటితో భారత్ తన లక్ష్యాలను నిర్దేశించుకుందన్నారు. శ్రీశ్రీ కళావేదిక సీఈవో డాక్టర్ కత్తిమండ ప్రతాప్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రచయితలు, కవులు, కళాకారులు, చిత్రకారులు, మేధావులు, సమాజ అభ్యున్నతికి కృషి చేసిన వారికి పురస్కారాలు, అవార్డులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ మీడియా అకాడమి మాజీ కార్యదర్శి ఎం.బాలగంగాధరతిలక్, శ్రీవిజ్ఞాన వేదిక ఫౌండర్ చెరుకువాడ రంగసాయి, డాక్టర్ పాల్‌రాజ్ ఇంజనీరింగ్ కాలేజీ చైర్‌పర్సన్ వి.వరలక్ష్మిపాల్గొన్నారు.

నష్టపరిహారం చెల్లించాకే అభివృద్ధి చేయండి

- పనులను అడ్డుకున్నరైతు



మల్లవల్లి పారిశ్రామికవాడలో పనులను అడ్డుకుంటున్న రైతు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : ఆరుగాలం శ్రమించి పండించిన మామడితోటను నష్టపరిహారం ఇవ్వకుండా హౌస్‌అరెస్ట్ చేసి అధికారులు బలవంతంగా తొలగించారని రైతు పంతం కామరాజు ఆగ్రహం వ్యక్తం చేశారు. మల్లవల్లి పారిశ్రామికవాడలో తనకు చెందిన భూమిలో అభివృద్ధి పనులను మంగళవారం ఆయన అడ్డుకున్నారు. కాపునకు వచ్చిన మామిడి తోటలను అధికారులు తొలగించడమే కాకుండా అభివృద్ధి పేరుతో చేస్తున్న పనులు అడ్డుకున్నట్టు ఆయన తెలిపారు. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ హామీలు ఇచ్చినా అధికారులు అమలు చేయట్లేదని ఆవేదన వ్యక్తం చేశారు. భూ నిర్వాసిత రైతులతో కలసి జనసేన పార్టీ కార్యాలయంలో పవన్‌కల్యాణ్‌కు సమస్యను వివరించేందుకు వెళ్లగా అధికారులు అభివృద్ధి పనులు చేపట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మల్లవల్లి భూ నిర్వాసిత రైతులకు నష్ట పరిహారం చెల్లించకుండా అభివృద్ధి పనులు చేస్తే అడ్డుకుంటామని పంతం కామరాజు అన్నారు. కార్యక్రమంలో దోనవల్లి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

రహదారుల అభివృద్ధికి నిధులు ఇవ్వండి

- మంత్రి జనార్దన్ రెడ్డికి ప్రభుత్వ విప్ సౌమ్య వినతి



మంత్రి జనార్దన్ రెడ్డికి రహదారులు దుస్థితిని వివరిస్తున్న తంగిరాల సౌమ్య

నందిగామ, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): నందిగామ నియోజకవర్గంలో ఉన్న అధ్వాన రహదారుల మరమ్మతులకు, గ్రామీణ ప్రాంతాలలో ఉన్న అనుసంధాన మార్గాల్లో ఉన్న శిథిలావస్థ వంతెన స్థానంలో కొత్త వంతెన నిర్మాణంకు తక్షణం నిధులు విడుదల చేయాలని ఆర్అండ్‌బీశాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డిని ప్రభుత్వ విప్, నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య మంగళవారం వెలగపూడి సచివాలయంలో కలిసి విన్నవించారు. విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని), జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరామ్ రాజ్‌గోపాల్‌తో కలిసి సౌమ్య మంత్రిని కలిశారు. నియోజకవర్గ సమగ్రాభివృద్ధికి రోడ్లు కీలకమని, ఇందుకు మంత్రి సానుకూలంగా స్పందించినట్టు, త్వరలోనే చర్యలు ప్రారంభిస్తామని మంత్రి హామీ ఇచ్చినట్టు ఆమె తెలిపారు.

ర్యాగింగ్ భూతం!

(5వ పేజీ తరువాయి)

అక్కడి నుంచే నేరుగా హాస్టల్‌కు తీసుకెళ్లిపోతున్నట్టు సమాచారం. ఇలాంటి ఘటనే నెల రోజుల కిందట కాలేజీలో జరిగిందని తెలిసింది. ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థిని మెస్ నుంచే సీనియర్లు వారి హాస్టల్ రూమ్‌కు తీసుకెళ్లి రెండు రోజుల పాటు నిర్బంధించినట్టు తెలిసింది. కేవలం భోజనానికి మాత్రమే అనుమతించినట్టు సమాచారం. ఈ విషయంపై విద్యార్థి తల్లిదండ్రులు కాలేజీలో ఫిర్యాదు చేసినప్పటికీ విద్యార్థి నోరు విప్పకపోవడం సీనియర్ విద్యార్థుల వేధింపులకు అద్దం పడుతోంది.

భయపెట్టి పనులు చేయించుకుంటూ..

సీనియర్ విద్యార్థులు మెస్‌లో భోజనానికి రాకుండా జూనియర్లతోనే వారి గదులకు భోజనం తెప్పించుకుంటున్నట్టు తెలుస్తోంది. సీనియర్ విద్యార్థుల తరగతి గదులు హాస్టల్‌లో పైఅంతస్తులో, జూనియర్ విద్యార్థులవి కింది ఉంటాయి. మెస్‌లో జూనియర్లు భోజనం చేసిన అనంతరం సీనియర్లకు పట్టుకెళ్తున్నారు. వారి ప్లేట్లను జూనియర్లే కడుగుతున్నారు. ఈ విధంగా ర్యాగింగ్ పేరుతో సుమారు 30 మందికి పైగా విద్యార్థులు ఇబ్బందిపడినట్టు సమాచారం. రాత్రి సమయంలో కాళ్లు పట్టించుకోవడంతో పాటు వారంలో ఒకటి రెండు రోజులు సీనియర్ల దుస్తులు కూడా ఉతికించుకుంటున్నట్టు తెలిసింది. ఈ వ్యవహారంపై ప్రిన్సిపాల్‌కు ఫిర్యాదు చేస్తే ర్యాగింగ్ తీవ్రత మరింత పెరుగుతుందని సీనియర్లు భయపెడుతున్నారని సమాచారం. దీంతో జూనియర్లు ఫిర్యాదు చేయడానికి కూడా వెనకడుగు వేస్తున్నారని తెలిసింది. అయితే వీరిలో కొంతమంది తమ తల్లిదండ్రుల వద్ద బాధపడటంతో విషయం బయటకు వచ్చింది. దీనిపై స్పందించిన కళాశాల యాజమాన్యం తల్లిదండ్రులను తీసుకు రమ్మని సీనియర్లను ఆదేశించినట్టు తెలిసింది. ఈ నేపథ్యంలోనే కళాశాలలో పోలీసులతో యాంటీ ర్యాగింగ్‌పై వరుస అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నారని విద్యార్థులు చెప్పుకుంటున్నారు.

హెచ్‌వోడీలతో ప్రిన్సిపాల్ సమావేశం

సీనియర్ విద్యార్థులు ర్యాగింగ్ పేరుతో జూనియర్లను వేధిస్తున్నారనే సమాచారం అందడంతో ప్రిన్సిపాల్ గత సోమవారం అన్ని విభాగాలకు చెందిన హెచ్‌వోడీలతో సమావేశం ఏర్పాటు చేసినట్టు తెలిసింది. ర్యాగింగ్ నిర్మూలనకు సంబంధించిన అంశాలపై చర్చించారు. అనంతరం ర్యాగింగ్‌కు పాల్పడిన విద్యార్థులను కళాశాలకు పిలిపించాలని నిర్ణయం తీసుకున్నారు. అదే విధంగా ర్యాగింగ్‌కు గురవుతున్నట్టు ఫిర్యాదు చేసిన విద్యార్థుల తల్లిదండ్రులను కాలేజీకి రావాలని కోరినట్టు సమాచారం. ఈ నేపథ్యంలోనే మంగళవారం పోలీస్ అధికారులతో ర్యాగింగ్‌పై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేసినట్టు తెలిసింది.

ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు : ఏసీపీ

ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఏసీపీ దామోదర్, మాచవరం సీఐ ప్రకాష్‌రావు హెచ్చరించారు. విద్యార్థులు ఏ కారణంతో కాలేజీకి వచ్చారో ఆ పని పూర్తిచేసుకుని మంచి మార్కులు, పేరు తెచ్చుకుని బయటకు వెళ్లాలని సూచించారు. కాలేజీలో ర్యాగింగ్ అనే పదానికి తావులేదని పేర్కొన్నారు. విద్యార్థులకు ఏ ఇబ్బంది ఉన్నా తమకు ఫిర్యాదు చేయవచ్చని భరోసా ఇచ్చారు.

యూపీఎస్సీ శిక్షణ!

(5వ పేజీ తరువాయి)

అందిస్తుంది. దీంతో పాటు ఒక్క విజయవాడలోని లెనిన్ సెంటర్‌లో ఉన్న అంబేడ్కర్ భవన్ స్టడీ సెంటర్‌లో 120 మందికి శిక్షణ ఇచ్చేందుకు అవకాశం కల్పించింది. అభ్యర్థులకు నిర్దేశించిన సీట్ల రిజర్వేషన్ విషయానికి వస్తే.. ఎస్సీలకు 80 శాతం, ఎస్టీలకు 6 శాతం, బీసీలకు 10 శాతం, ఓసీలకు 4శాతం, పీడబ్ల్యూడీ-3 శాతం చొప్పున రిజర్వేషన్ కల్పించారు. ప్రైవాటిలో మహిళా అభ్యర్థులకు 33 శాతం రిజర్వేషన్ కల్పించారు. రెగ్యులర్ గ్రాడ్యుయేట్ అయి ఉండాలని నిబంధన విధించారు. దరఖాస్తు చేసుకోవటానికి అభ్యర్థులకు రూ.8లక్షల సంవత్సరాదాయాన్ని నిర్ణయించారు.

వివాదాస్పదంగా బీసీ వెల్ఫేర్ మార్గదర్శకాలు

బీసీ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ మార్గదర్శకాలు వివాదాస్పదంగా ఉన్నాయి. గొల్లపూడిలోని బీసీ స్టడీ సర్కిల్ కేంద్రంగా శిక్షణ ఇవ్వటానికి అభ్యర్థులకు సంవత్సర ఆదాయాన్ని రూ.లక్షగా నిర్ణయించారు. రేషన్ కార్డు తీసుకోవటానికి రూ.2 లక్షల ఆదాయాన్ని ఇస్తున్నపుడు, దాని కంటే తక్కువగా రూ. లక్ష ఆదాయ పరిమితి పెట్టడంపై అభ్యర్థుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. రిజర్వేషన్లలో బీసీలకు 66 శాతం, ఎస్సీలకు 20 శాతం, ఎస్టీలకు 14 శాతం చొప్పున ఇచ్చారు. ఓసీ, పీబ్ల్యూడీలకు ఇవ్వలేదు. ఓసీలో కూడా దారిద్ర్య రేఖకు దిగువన ఉండే వారు ఉంటారు. ఎకనమికల్ వీకర్ సెక్షన్స్ (ఈడబ్ల్యూఎస్) ఉంటారు. వీరు కూడా ఉచిత శిక్షణ తీసుకోవటానికి అర్హులే. సోషల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ అన్ని వర్గాలకు రిజర్వేషన్లు కల్పించినపుడు బీసీ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ ఎందుకు అన్ని వర్గాలకు రిజర్వేషన్లు కల్పించటం లేదన్న దానిపై కూడా తీవ్ర విమర్శలు వస్తున్నాయి. డీఎస్సీ సందర్భంలో అన్నివర్గాలకు రిజర్వేషన్లు కల్పించినపుడు.. యూపీఎస్సీ ఉచిత శిక్షణకు ఎందుకు అమలు చేయడంలేదని ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

హడావిడిగా ముగిసిన దరఖాస్తుల గడువు

ఉచిత శిక్షణ కోసం నిర్వహించే పరీక్షలకు సోషల్ వెల్ఫేర్ కంటే కూడా బీసీ వెల్ఫేర్ అభ్యర్థులకు ఎక్కువ సమయం ఉంది. బీసీ వెల్ఫేర్ తరఫున దరఖాస్తులు చేసుకునే వారికి డిసెంబరు 5వ తేదీన పరీక్షలు నిర్వహిస్తారు. కానీ మంగళవారం నాటికి దరఖాస్తులు ఆఖరు తేదీగా ప్రకటించారు. అదే సోషల్ వెల్ఫేర్ అభ్యర్థులకైతే ఈ నెల 30వ తేదీన పరీక్షలను నిర్వహిస్తున్నారు. కానీ ఈ నెల 26 వరకు దరఖాస్తులకు గడువు ఇచ్చారు. బీసీ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ కూడా నెలాఖరు వరకు గడువు ఇవ్వటానికి అవకాశం ఉన్నా ఇవ్వకపోవటం గమనార్హం.

సరైన ప్రచారం లేదు..

సోషల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ అభ్యర్థుల కోసం సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున ప్రచారం చేయటంతో స్పందన వచ్చింది. కుప్పలు తెప్పలుగా దరఖాస్తులు వచ్చాయి. కానీ బీసీ వెల్ఫేర్ తరఫున ఉచిత శిక్షణకు స్పందన కొరవడింది. చాలా తక్కువ సంఖ్యలోనే దరఖాస్తులు వచ్చాయి. బీసీ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ సరైన ప్రచారాన్ని నిర్వహించలేదు. ప్రచారం నిర్వహించటానికి కూడా ఆసక్తి చూపలేదని విమర్శలు ఉన్నాయి.

కోలుకోలేని దెబ్బ!

(5వ పేజీ తరువాయి)

తోటలు నిలువునా కూలిపోయాయి. కూలిన చెట్లను నరికించేందుకు ఎకరానికి రూ.12వేల వరకు కూలీలు తీసుకుంటున్నారని రైతులు చెబుతున్నారు. ముక్కలుగా నరికిన అరటి చెట్లను ట్రాక్టర్ల ద్వారా దూర ప్రాంతానికి తరలించేందుకు ఎస్కవేటర్, ట్రాక్టర్లకు కలిపి మరో నాలుగైదువేల రూపాయలు ఖర్చు చేయాల్సి వస్తోందని అంటున్నారు. అరటి చెట్లను మొదలుతో సహా తొలగించి వేరే పంటలు సాగు చేసేందుకు అనుకూలంగా మార్చేందుకు దుక్కి ఖర్చులు మరో రూ.పది వేల వరకు అవుతున్నాయని చెబుతున్నారు. ఎకరం అరటి తోటను పూర్తిగా తొలగించి వేరే పంటల సాగుకు అనుకూలంగా భూమిని మార్చడానికి కనీసంగా ఎకరానికి రూ.25వేల ఖర్చు అవుతోందని రైతుల మాటగా ఉంది.

కౌలు రూ.40 వేలపైనే..

అరటి తోటలు సాగు చేసే రైతుల్లో అధికంగా కౌలు రైతులే ఉన్నారు. ఆయా ప్రాంతాల్లో భూమి సారాన్ని బట్టి ఎకరం అరటి తోటకు కౌలుగా రూ.40 వేల నుంచి రూ.55 వేల వరకు ముందస్తుగానే చెల్లించాల్సి ఉంటుంది. అరటి తోట గెలలు తయారయ్యి, కోత దశకు చేరేనాటికి ఎకరానికి రూ.60 వేల నుంచి రూ.70 వేల వరకు పెట్టుబడిగా పెట్టారు. తుఫాను కారణంగా తోటలు నేలవాలడంతో ఈ పెట్టుబడి మొత్తం నష్టపోయామని రైతులు వాపోతున్నారు. అరటి గెలలు తయారయ్యే సమయంలో చెట్లు పడిపోకుండా వెదురు వాసాలు కూడా పెట్టామని, ఒక్కో వాసం ఖరీదు వంద రూపాయల నుంచి రూ.120 వరకు ఉంటుందని, బలమైన గాలులు వీయడంతో అరటి చెట్లతో పాటూ వాసాలు కూడా విరిగిపోయాయని అంటున్నారు. ఎకరానికి 750 నుంచి 800 వరకు అరటి చెట్లు పెడతామని, ఇవన్నీ పడిపోవడంతో పెట్టుబడి, రాబడి, చెట్ల తొలగింపు తదితర పనులతో కలుపుకుని రూ.1.75 లక్షలు మేర నష్టం వాటిల్లిందని రైతులు కన్నీరు పెడుతున్నారు. పంట రూపంలో నష్టపోయిన నగదును మళ్లీ రాబట్టుకోవాలంటే వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉంటే రెండు, మూడు సంవత్సరాలు పడుతుందని చెబుతున్నారు. కూర అరటి సాగు చేసిన పొలాల్లోని అరటి తోటలు కూడా పడిపోయాయని, ఆ చెట్ల గెలలకు ఉన్నకాయలు పూర్తిగా తయారు కాలేదని, దీంతో వీటికి మార్కెట్‌లో సరైన ధర లభించలేదని అంటున్నారు.

పది ఎకరాల్లో నష్టం

-గద్దె శ్రీహరి, రైతు, మోపిదేవి

మోపిదేవి మండలంలోని మోపిదేవి వార్పు, బొబ్బర్లంక గ్రామాల్లో కరకట్ట వెంబడి 10 ఎకరాల్లో అరటి తోటలు సాగు చేశా. మొంథా తుఫాను కారణంగా కోతకు గెలలు తయారైన తోటల్లో అరటి చెట్లు కూలిపోయాయి. ఎకరానికి రూ.60 వేల నుంచి రూ.70 వేల వరకు పెట్టుబడిగా పెట్టా. పంటను పూర్తిగా నష్టపోయా. ఈ నష్టం ఇలా ఉంటే కూలిన అరటి చెట్లను తొలగించేందుకు, వేరే పంటకు భూమిని సిద్ధం చేసేందుకు ఎకరానికి కనీసంగా రూ.25 వేల ఖర్చు అవుతోంది. అరటి చెట్లను మొదలుతో సహా తొలగించేందుకు గుడివాడలో తయారు చేయించిన బనానా ట్రీ కట్టర్‌ను ట్రాక్టరుకు బిగించి పనిచేయిస్తుంటే ట్రాక్టర్‌పై అదనపు లోడ్ పడుతోంది. తుఫాను కారణంగా అరటి పంటను నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి.

కరుణకుమారికి గొట్టిపాటి హర్ష రూ.5 లక్షల ప్రోత్సాహం

- మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి

అమరావతి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : భారత జట్టు అంధుల మహిళా టీ 20 వరల్డ్ కప్ విజయంలో కీలకపాత్ర పోషించిన విశాఖ బాలికల అంధుల రెసిడెన్షియల్ విద్యార్థిని కరుణకుమారికి కిషోర్ గ్రానైట్స్ అధినేత గొట్టిపాటి హర్ష రూ.5 లక్షల ప్రోత్సాహకం ప్రకటించినట్టు దివ్యాంగుల సంక్షేమశాఖా మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫైనల్ మ్యాచ్‌లో కరుణకుమారి చూపిన ప్రతిభకు ప్రోత్సాహకంగా గొట్టిపాటి హర్ష పోత్సాహకం ప్రకటించినట్టు మంత్రి తెలిపారు. విభిన్న ప్రతిభావంతుల క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ముందుకు రావడం అభినందనీయమని హర్షకు అభినందనలు తెలియజేస్తున్నట్టు మంత్రి పేర్కొన్నారు.



రైస్‌మిల్లు గేటుకు నోటీసు పెడుతున్న తహసీల్దార్

కృష్ణా ఆగ్రోస్ రైస్‌మిల్లు మూసివేత

ఉయ్యూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : ఉయ్యూరు బైపాస్ రోడ్డు టీటీడీ కళ్యాణ మండపం వెనుక కృష్ణా ఆగ్రోస్ ఇండస్ట్రీస్ రైస్‌మిల్లును మండల తహసీల్దార్ మంగళవారం మూసివేయించారు. కొనుగోలు కేంద్రాల నుంచి మిల్లుకు వచ్చిన ధాన్యం వెంటనే దిగుమతి చేయకుండా రైతులను పిలిచి ధర విషయంలో ఇబ్బందులకు గురిచేస్తున్నట్టు జాయింట్ కలెక్టర్‌కు ఫిర్యాదులు రావడంతో జేసీ ఆదేశాల మేరకు తహసీల్దార్ మిల్లును తనిఖీచేశారు. రైస్‌మిల్లు నిర్వాహకులు పెడుతున్న ఇబ్బందులను తహసీల్దార్‌కు రైతులు వివరించారు. రైతుసేవా కేంద్రాల ద్వారా ధాన్యం తీసుకు వచ్చిన వాహనాల నుంచి రోజుల తరబడి దిగుమతి చేయకుండా తేమ ఎక్కువగా ఉందని, తప్పతాలు ఉందని, రంగు మారిందని కుంటి సాకుతో రైతులను ఇబ్బంది పెడుతూ ప్రభుత్వ కనీసమద్దతు ధర కంటే రెండు మూడు వందలు తక్కువకు తీసుకుంటూ నష్టపరుస్తున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. దీంతో తహసీల్దార్ తనిఖీచేసి మిల్లును తాత్కాలికంగా మూసివేయించి గేటుపై నోటీసు ఏర్పాటుచేశారు. వెబ్‌సైట్‌లో కూడా మిల్లును బ్లాక్ చేయించామని తెలిపారు. నిర్ణీత ప్రమాణాల ప్రకారం ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా కనీస మద్ధతు ధర పొందాలని విజ్ఞప్తిచేశారు.

ది కృష్ణా డిస్ట్రిక్ట్ లారీ ఓనర్స్ కో-ఆపరేటివ్ స్టోర్స్ నూతన కార్యవర్గం

విజయవాడ సిటీ, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ది కృష్ణా డిస్ట్రిక్ట్ లారీ ఓనర్స్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కో-ఆపరేటీవ్ స్టోర్స్ విజయవాడ నూతన పాలకవర్గం డైరెక్టర్లుగా కోనేరు వెంకటరామారావు, గోపిశెట్టి వీరవెంకయ్య, కొల్లి రామచంద్రరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈనెల 24 సాయంత్రం జరిగిన ఆఫీసు బేరర్ల ఎన్నికల్లో చైర్మన్‌గా కోనేరు వెంకటరామారావు, వైస్‌చైర్మన్‌గా వీరపనేని వెంకటేశ్వరరావు, సెక్రటరీగా గోపిశెట్టి వీరవెంకయ్యలు ఏకగ్రీవంకాగా.. ప్రధాన ఎన్నికలఅధికారిగా పాలడుగు వెంకటేశ్వరరావు వ్యవహరించారు.

ఇప్పటికి ఇంతే!

(5వ పేజీ తరువాయి)

డివిజన్‌గా ఉంది. ఈ అంశాన్ని దృష్టిలో పెట్టుకుని చూస్తే నూజివీడును ఎన్టీఆర్‌లో కలిపితే రెవెన్యూ డివిజన్‌గా కూడా అదే ఉంటుంది కాబట్టి .. కొత్త రెవెన్యూ డివిజన్ అవసరం లేదన్న చర్చ నడుస్తోంది. ఇప్పటికిప్పుడు కాకపోయినా.. సీఎం చంద్రబాబు గన్నవరం, పెనమలూరు, నూజివీడు నియోజకవర్గాలను ఎన్టీఆర్ జిల్లాలో కలుపుతారని ప్రజలు భావిస్తున్నారు.

ఎన్టీఆర్ జిల్లాలో కలిపితే అభ్యంతరం లేదు : బోడె

పెనమలూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): జిల్లాల చేర్పులు, మార్పుల నేపథ్యంలో పెనమలూరు నియోజకవర్గాన్ని ఎన్టీఆర్ జిల్లాలో కలపాలనుకుంటే తనకెలాంటి అభ్యంతరం లేదని పెనమలూరు ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. పెనమలూరును ఎన్టీఆర్ జిల్లాలో కలిపే విషయంలో తనకు అభ్యంతరాలు ఉన్నాయని ప్రచారాన్ని ఖండిస్తున్నట్టు చెప్పారు. కృష్ణా జిల్లా పునర్విభజన విషయంలో తనను మంత్రివర్గ ఉపసంఘం సంప్రదించలేదని స్పష్టం చేశారు. తాను కూడా ఇంతవరకు ఈ విషయంపై ఎక్కడా చర్చించలేదని తెలిపారు. మెజారిటీ ప్రజల అభీష్టానికి అనుగుణంగా ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకున్నా తాను ఆహ్వానిస్తానని చెప్పారు. పునర్విభజన విషయంలో ప్రభుత్వం తీసుకొనే నిర్ణయానికి కట్టుబడి ఉండాల్సిన బాధ్యత ప్రతి ఎమ్మెల్యేపై ఉందని వ్యాఖ్యానించారు.

ఈవోటీలు ఇవ్వండి ప్లీజ్!

(5వ పేజీ తరువాయి)

టెండర్లు దక్కించుకున్న కాంట్రాక్టర్లు ఈవోటీలు తీసుకోకుండానే పనులు మొదలుపెట్టారు. ప్రతి ఏడాది నీటి సంవత్సరం (జూన్ నుంచి ఏప్రిల్ వరకు) ప్రారంభం కావడానికి ముందు జలవనరులశాఖ వివిధ పనులను ప్రతిపాదిస్తుంది. కాల్వలకు నీటివిడుదలను నిలిపేసిన తర్వాత లాకులకు మరమ్మతులు, డ్రెయిన్లలో పూడికతీత, కాల్వల్లో మట్టి తవ్వకాలు, కరకట్ల పటిష్టత వంటి పనులకు టెండర్లను ఆహ్వానిస్తారు. ఈ ఏడాది మేలో ఈ పనులకు టెంటర్లను దక్కించుకున్న కాంట్రాక్టర్లలో కొంతమంది చేయకుండా వదిలేశారు. ఈ ఏడాది ప్రతిపాదించిన పనులు, వాటి వివరాలను ఇవ్వాలని విజిలెన్స్ అధికారులు లేఖ ఇవ్వడంతో ఇంజనీరింగ్ అధికారులకు వణుకు మొదలైంది. వెంటనే కాంట్రాక్టర్లను పిలిపించుకుని ఆ పనులను మొదలు పెట్టాలని చెప్పారు. గుడివాడలో భూమికోడు మేజర్ డ్రెయిన్ పూడికతీత పనులను కాంట్రాక్టర్ ఇప్పుడు ప్రారంభించారు. ఎలాంటి ఈవోటీలు తీసుకోకుండానే ఈ పనులు చేస్తుండడం గమనార్హం. కొంతమంది మాత్రం ఈవోటీలు ఇవ్వాలని అధికారులకు దరఖాస్తులు చేసుకున్నారు.

లంచం తీసుకుంటూ పట్టుబడ్డ ఈఎస్ఐ అధికారులు

విశాఖపట్నం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : ఇంటి అటాచ్‌మెంట్ ప్రక్రియ నిలుపుదల కోసం రూ.50 వేలు డిమాండ్ చేసిన ఎంప్లాయిస్ స్టేట్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఈఎస్ఐ)కు చెందిన సోషల్ సెక్యూరిటీ అధికారి ఎ.రవికుమార్, రెవెన్యూ రికవరీ అధికారి కె.సాయికుమార్‌ను విశాఖపట్నం సీబీఐ అధికారులు మంగళవారం అరెస్టు చేశారు. భారత ఆహార సంస్థ నిర్వహించే వేలంలో పాల్గొనేందుకు విజయవాడలో ఒకరు శ్రీశివసాయి ఏజెన్సీస్ అనే సంస్థను ప్రారంభించారు. ఈనెల 20న సంస్థ యజమాని ఇంటికి ఎంప్లాయిస్ స్టేట్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఈఎస్ఐ)కు చెందిన సోషల్ సెక్యూరిటీ అధికారి ఎ.రవికుమార్, రెవెన్యూ రికవరీ అధికారి కె.సాయికుమార్ వెళ్లి ఇంటి అటాచ్‌కు నోటీస్ ఇచ్చారు. నోటీస్ నిలుపుదల చేయాలంటే రూ.50 వేలు లంచం ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీనిపై ఏజెన్సీస్ యజమాని విశాఖపట్నంలోని సీబీఐ అధికారులకు ఫిర్యాదు చేశారు. వారి సూచన మేరకు ఆయన మంగళవారం ఈఎస్ఐ అధికారులకు రూ.50 వేలు ఇస్తుండగా పట్టుకుని విజయవాడ కోర్టులో హాజరుపరిచారు.

గన్నవరం డిపోకు ఫస్ట్ ఎయిడ్ కిట్లు అందజేత

హనుమాన్‌జంక్షన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): సురక్షిత ప్రయాణమే లక్ష్యంగా బస్సు సర్వీసులను నడపుతోందని ఆర్టీసీ గన్నవరం డిపో మేనేజర్ శివాజీ తెలిపారు. మంగళవారం స్థానిక శ్రీ హాస్పిటల్ డాక్టర్ ఉదయగిరి గన్నవరం డిపోకు అవసరమైన 150 ఫస్ట్ ఎయిడ్ కిట్లు మేనేజర్ శివాజీకి అందజేశారు. బస్టాండ్ కంట్రోలర్ వెంకటేశ్వరరావు, విశ్రాంతి ఉద్యోగి సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.



రైతును రాజుగా చూడాలి

ఎమ్మెల్యే బోడె ప్రసాద్





గంగూరులో రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్.. గన్నవరంలో రైతన్న మీకోసం కరపత్రాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

పెనమలూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): రైతును రాజుగా చూడాలన్నదే కూటమి ప్రభుత్వ ఆకాంక్ష అని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. మంగళవారం గంగూరులో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రైతన్నా...నీకోసం కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సాగుకు అవసరమైన నీటి లభ్యత, సాధారణ పంటలు, వాణిజ్య పంటల్లో దిగుబడి ద్వారా ఆర్థిక బలోపేతానికి రైతుకు అండగా ఉండాలని అధికారులను ఆదేశించారు. వాణిజ్యపంటల్లో అంతర పంటలను సాగుచేయడం, సేంద్రియ ఎరువుల ద్వారా భూమిలో పోషకవిలువలు పెంచుతూ దిగుబడి పెరిగేలా, సాంకేతికంగా డ్రోన్‌ల సాయంతో ఖర్చు తగ్గించడం ద్వారా రైతును రాజుగా చూడవచ్చన్న ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ కూటమి నేతలు అనుమోలు ప్రభాకరరావు, కోయ ఆనంద్‌ప్రసాద్, యేకుల విజయేంద్ర, సంగెపు రంగారావు, కుర్రా నరేంద్ర, అబ్దుల్ ఇర్ఫాన్ బాషా, అబ్దుల్ గౌస్, సలాం, ఏవో శైలజ పాల్గొన్నారు.

● పెనమలూరులో జరిగిన కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు కోయ ఆనంద్‌ప్రసాద్, ఏవో శైలజ మాట్లాడుతూ రైతులు పంటలో తేమశాతాన్ని 17 శాతం వచ్చేవరకు ఆరబెట్టుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కలపాల శ్రీధర్, ముసునూరు శ్రీనివాసరావు, మాబు సుబాని, పిడికిటి శ్రీనివాస్, కిలారు వెంకటసుబ్బారావు, తోటకూర ఉదయభాస్కర్, చిగురుపాటి శ్రీనివాస్, మట్టపర్తి రామకృష్ణ, షేక్ సుబాని తదితరులు పాల్గొన్నారు.

ఉయ్యూరు : పాడి పరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం పలు పథకాలు అమలు చేస్తూ పాడి రైతులను ప్రోత్సహిస్తుదని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి చిన్ననరసింహులు అన్నారు. రైతన్నా.. నీకోసం కార్యక్రమంలో భాగంగా మంగళవారం కలవపాములలో పర్యటించి పాడి పరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు వివరించి, పాడి రైతులు పాలఉత్పత్తి పెంపుదల కోసం అవస రమైన పలు సూచనలు చేశారు. పీఏసీఎస్ చైర్మన్ కలపాల మల్లేశ్వరరావు, ఏఎంసీ డైరెక్టర్ పామర్తి శ్రీనివాస రావు, జూనియర్ వెటర్నరీ ఆఫీసర్ పద్మావతి, వంశీనాయక్ పాల్గొన్నారు.

అన్నదాతకు అండగా చంద్రబాబు ..

గన్నవరం: వ్యవసాయంలో సాంకేతికతను కూటమి ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. మంగళవారం స్థానిక కొత్తపేటలో రైతన్న మీకోసం కరపత్రాలను ఇంటింటికి పంపిణీ చేసిన అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు మాట్లాడుతూ, అన్నదాతకు సీఎం చంద్రబాబు అండగా ఉంటానని భరోసా ఇచ్చారన్నారు. రాష్ట్రంలో ప్రతి ఎకరాకు నీరందించేలా అసంపూర్తి ప్రాజెక్టులను పూర్తి చేస్తున్నట్లు తెలిపారు. సమర్థ నీటి నిర్వహణతో అన్ని ప్రాజెక్టులు నీటితో కళకళలాడే విధంగా చర్యలు ప్రభుత్వం తీసుకుంటుందన్నారు. మారుతున్న అలవాట్లకు అనుగుణంగా రైతులు సాగు పద్ధతులను మార్చుకోవాలన్నారు. చిరుధాన్యాల సాగు పెంచటంతో పాటు ప్రకృతి వ్యవసాయం అవలంబించాలన్నారు. వ్యవసాయాన్ని లాభసాటిగా చేయటమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ఏఎంసీ చైర్మన్ గూడవల్లి నరసింహారావు, ఇన్‌చార్జి సర్పంచ్ పాలడుగు నాని, వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు ఎం.సునీల్, తహసీల్దారు కేవీ శివయ్య, ఏవో కె.శివ ప్రసాద్, టీడీపీ మండల అధ్య క్షులు గూడపాటి తులసీమోహన్, కార్యదర్శి బోడపాటి రవి, జనసేన నాయకుడు చిమట రవివర్మ, పడమట రంగారావు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే కూటమి లక్ష్యం

హనుమాన్‌జంక్షన్ : ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో రైతు సంక్షేమానికి కూటమి ప్రభుత్వం పెద్ద పీట వేసిందని టీడీపీ బాపులపాడు మండల అధ్యక్షుడు దయాల రాజేశ్వరరావు ప్రజలకు వివరించారు. రైతన్నా.. మీకోసం ప్రచార కార్యక్రమంలో భాగంగా మంగళవారం బాపులపాడు గ్రామంలో గ్రామ సచివాలయం సిబ్బంది ఇంటింటా కరపత్రాలు పంపిణీ చేశారు. ఏడీ ఎం.ప్రమీలరాణి, కూటమి నాయకులు అట్లూరి శ్రీనివాసరావు, గార్లపాటి రాజేశ్వరావు, వీఆర్వో గాబ్రియేల్, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్‌జంక్షన్‌రూరల్ : వ్యవసాయ రంగ అభివృద్ధికి ప్రభుత్వం ప్రకటించి పంచసూత్రాలను ఆచరిస్తూ సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలని వీఆర్‌ఓ సునీల్‌కుమార్, ఏఓ రంగనాథ్‌బాబు సూచించారు. నారాయణపురంలో మంగళవారం నిర్వహించిన రైతన్నా..మీకోసం. కార్యక్రమంలో పాల్గొన్నారు. నీటి భద్రత, డిమాండ్ ఆధారిత పంటలతో ఆర్థిక లాభం, తదితర విషయాలను రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్వరరావు, తదితర రైతులు పాల్గొన్నారు.







కలవపాములలో రైతన్నా.. నీకోసంలో.. బాపులపాడులో.. నారాయణపురంలో పాల్గొన్న పార్టీ నాయకులు



కానుమోలు ఆయుర్వేద ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేసిన దినేష్‌కుమార్

అందరికీ ఆయుర్వేద వైద్యం

ఆయుష్ డైరెక్టర్ కె. దినేష్ కుమార్

హనుమాన్‌జంక్షన్‌రూరల్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి) : ప్రజలందరికీ ఆయుర్వేద వైద్యం అందించేందుకు కార్యాచరణ రూపొందించినట్టు ఆయుష్ డైరెక్టర్ కె. దినేష్ కుమార్ తెలిపారు. కానుమోలులోని ప్రభుత్వ ఆయుష్ ఆయుర్వేద ఆసుపత్రిలో ఆయన మంగళవారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. రికార్డులను తనిఖీ చేసి వైద్య చికిత్సకు వచ్చిన వారికి అందుతున్న సేవలపై ఆరా తీశారు. కానుమోలు ఆసుపత్రి ప్రాంగణంలో డాక్టర్ వాహిని పెంచుతున్న వివిధ ఔషధ మొక్కలను, మందులను, ఆవరణ శుభ్రతను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇటీవల రాష్ట్ర వ్యాప్తంగా ఆయుర్వేద ఆసుపత్రులకు మందులు అందజేశామని, ఆయుష్ శాఖ ద్వారా ప్రజలకు అందుతున్న సేవలను పరిశీలిం చేందుకు తనిఖీ చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ప్రభుత్వం ద్వారా ఆయుష్‌శాఖకు ఈ ఏడాది రూ.165 కోట్ల నిధులు మంజూరు చేయడం జరిగిందని, త్వరలో రాష్ట్రంలో రెండు ఆయుర్వేద కళాశాలలు, యునాని కళాశాల, 50 బెడ్లతో ఇంటిగ్రేటెడ్ ఆయుర్వేద ఆసుపత్రులు రాబోతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ ధనుంజయ్, రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ కుమార్, పీఎంయు టీం సభ్యులు, మాగంటి సురేష్, కొండపల్లి హరిబాబు, రహీం, క్రాంతి తేజ, రమేష్ పాల్గొన్నారు.

పేదలకు సీఎం సహాయనిధి వరం

పెనమలూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): పేదలకు సీఎం సహాయనిధి వరమని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. మంగళవారం పోరంకి టీడీపీ కార్యాలయంలో జరిగిన సీఎం సహాయనిధి ఎల్వోసీల పంపిణీ కార్యక్రమంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ కూటమి నేతలు అనుమోలు ప్రభాకరరావు, మారుపూడి ధనకోటేశ్వరరావు, కోయ ఆనంద్‌ప్రసాద్, యార్లగడ్డ సుచిత్ర, అంగిరేకుల మురళి, తుమ్మల రాంకుమార్, పీతా గోపీచంద్, తాతపూడి గణేష్, యేకుల విజయేంద్ర, సంగెపు రంగారావు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి చెకుముకి పోటీలకు బాపులపాడు విద్యార్థులు

హనుమాన్‌జంక్షన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థి శాస్త్రీయ అవగాహనతో ఉండాలని బాపులపాడు జడ్పీ హైస్కూల్ అభివృద్ధి కమిటీ చైర్మన్ సుంకర సుభాష్ చంద్రబోస్ అన్నారు. జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహిం చిన జిల్లాస్థాయి చెకుముకి పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన స్థానిక జడ్పీ హైస్కూల్ విద్యార్థులు వాసవీ శిరీష,శివలీల దేవి, శ్రీరామకృష్ణలకు మంగళవారం పాఠశాలలో అభినందించి ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో శ్రవంతి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ వీరమాచనేని సత్యప్రసాద్, హెచ్ఎం ఎం. శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు చలపతి తదితరులు పాల్గొన్నారు.

ఆదిత్య బధిర విద్యార్థుల ప్రతిభ

హనుమాన్‌జంక్షన్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఏలూరు అల్లూరి సీతారామరాజు స్టేడియంలో జిల్లా స్థాయిలో విభిన్న ప్రతిభావంతులకు మంగళవారం నిర్వహించిన ఆటల పోటీల్లో స్థానిక ఆదిత్య బధిర విద్యాలయం విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచినట్లు ఆ పాఠశాల ప్రిన్సిపాల్ ఆకుల వెంకటరమణ ప్రకటనలో తెలిపారు.100 మీటర్ల పరుగు పందెం, డిస్క్‌త్రోలో కె.హను, షార్ట్‌పుట్‌లో బి.నిత్యానందకుమార్‌లతో పాటు బాలబాలికల జూనియర్,సీనియర్ విభాగాల్లో నిర్వహించిన షాట్‌పుట్, సాఫ్ట్‌బాల్,డిస్క్ త్రో విభాగాల్లో మణికంఠ, కుసుమ,హస్మిత,మాదవి,గిరిధర్ తదితర విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచినట్లు పేర్కొన్నారు. విద్యార్థులను ఈ సందర్భంగా ఉపాధ్యాయులు అభినందించారు.

యనమదల సేవలు అభినందనీయం

హనుమాన్‌జంక్షన్‌రూరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రాంతాల్లో టీడీపీ ఆవిర్భావం నుంచి పార్టీ అభ్యున్నతికి యనమదల వెంక య్యారావు అందించిన సేవలు నిరుపమానమని తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి గుండపనేని ఉమావరప్రసాద్ అన్నారు. మల్లవల్లిలో యనమదల వెంకయ్యారావు నివాసంలో మంగళవారం ఆయన పుట్టినరోజు సందర్భంగా వేదాశీర్వచనంతో కూడిన సత్కారాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మండాది రవీంద్ర, కలపాల రాధాకృష్ణమూర్తి, అక్కినేని మాణిక్యాలరావు, తదితరులు పాల్గొన్నారు.

శ్రీచైతన్య విద్యార్థులకు నాసా కిట్‌లు పంపిణీ

కానూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): కానూరు అశోక్‌నగర్‌లోని శ్రీచైతన్య స్కూల్‌లో చదివే విద్యార్థులకు మంగళవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో యాజమాన్యం నాసా కిట్‌లను పంపిణీ చేసింది. విద్యార్థుల్లో శాస్త్రీయ విజ్ఞానాన్ని పెంపొందించడం, అంతరిక్ష విజ్ఞానం పట్ల ఆసక్తి పెంపొందించడం కోసం నాసా విద్యా కార్యక్రమంలో భాగంగా ఈకిట్‌లు అందజేశారు. ఈ సందర్భంగా స్కూల్ ప్రిన్సిపాల్ వి. శ్రీరంజని, డీన్ గోపాల్‌రావు ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రసంగిస్తూ ఈ కిట్‌లు విద్యార్థుల్లో శాస్త్రాన్వేషణ ప్రా జెక్టులు తయారీ, క్రియేటివ్ థింకింగ్‌ను పెంపొందించడంలో ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో కో- ఆర్డినేటర్ చక్రధర్, బ్యాచ్ ఇన్‌చార్జి వీరబాబు, నాసా ఇన్‌చార్జి హేమ, శ్యామల విద్యార్థులకు కిట్‌లు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లకు కిట్‌లు అందజేసిన స్కూల్ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు.

జనసేన నాయకుడికి చేయూత

ప్రసాదంపాడు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న రామవరప్పాడు జనసేన పార్టీ నాయకులు వంగూరు గిరిధర్ నాయుడు చికిత్సకు రూ. 20 వేలను ఏపీ రోడ్డు డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్, గన్నవరం నియోజకవర్గ జనసేన నాయ కులు గరికిపాటి శివ శంకర్ చేయూత నందించారు. మంగళవారం గిరిధర్ నాయుడును పరామర్శించి ఆయ న ఆరోగ్య విషయాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో విజయవాడ రూరల్ మండల ప్రధాన కార్యదర్శి కూనపరెడ్డి నాని, కొండూరు శ్రీహరి కృష్ణ, చిలుకూరి ఆంజనేయులు, కాట్రగడ్డ రాంబాబు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

ఉయ్యూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ద్వారా క్షేమంగా గమ్యం చేరుకోవచ్చని కంకిపాడు సీఐ మురళీకృష్ణ అన్నారు. రహదారిపై అవగాహన కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఆకునూరు వద్ద హైవేపై వాహన చోదకులకు రోడ్డు ప్రమాదాలు, నివారణపై అవగాహన కల్పించారు. ద్విచక్రవాహనాలు నడిపే ప్రతిఒక్కరు హెల్మెట్ తప్పక ధరించాలని సూచించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోతే ప్రమాదాల బారిన పడి కుటుంబానికి దూరం కావలసి వస్తుందని అలాంటి దుస్థితి ఏకుటుంబానికి రాకూడదన్నారు. రూరల్ ఎస్సై సురేశ్‌బాబు మాట్లాడుతూ రహదారి ప్రమాదాల నివారణలో ట్రాఫిక్ నిబంధనల మేర పోలీసు వ్యవస్థ కఠినంగా వ్యవహరిస్తుందని హెచ్చరించారు.

ధాన్యం కొనుగోలుపై అపోహాలు వద్దు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి) : బాపులపాడు మండల వ్యాప్తంగా 13 కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు ప్రారంభమైందని, కుప్పలు వేసిన రైతులు తప్ప మిగిలిన వారి వద్ద నుంచి ధాన్యం సేకరణ జరుగుతోందని ఏవో బి. రంగనాథ్‌బాబు తెలిపారు. కానుమోలు, ఆరుగొలను, కాకులపాడు గ్రామాల్లో మంగళవారం క్షేత్రస్థాయి పరిశీలన జరిపి రైతులతో మాట్లాడారు. ఆయా గ్రామాల వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇళ్ల స్థలాలు : యార్లగడ్డ

గన్నవరం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో అర్హులైన ప్రతి ఒక్కరికి ఇళ్ల స్థలాలు ఇస్తామని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు హామీ ఇచ్చారు. స్థానిక రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం మండలంలోని పలు గ్రామాలకు చెందిన 200 మంది లబ్ధిదారులకు రూ. 10.63 కోట్ల విలువ చేసే ఇళ్ల స్థలాలకు రిజిస్ట్రేషన్ దస్తావేజులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెంకట్రావు మాట్లాడుతూ, నియోజకవర్గంలో అర్హులందరికీ ఇళ్ల పట్టాలు ఇస్తామన్న ఎన్నికల హామీలు నెరవేర్చేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ భూముల్లో ఇళ్లు నిర్మించుకున్న పేదలకు 150 గజాల స్థలాలను క్రమబద్ధీకరిస్తూ రిజిస్ట్రేషన్ ఖర్చు కూడా లేకుండా ప్రభుత్వమే రిజిస్ట్రేషన్ చేయించి పట్టాలిస్తున్నట్లు చెప్పారు. పేదలకు తన చేతుల మీదుగా ఇళ్ల పట్టాలు ఇవ్వటం అదృష్టంగా భావిస్తున్నట్టు పేర్కొన్నారు. ఏఎంసీ చైర్మన్ గూడవల్లి నరసింహారావు, పాలడుగు నాని, దొంతు చిన్న, గూడపాటి తులసి మోహన్, చలమలశెట్టి రమేష్ బాబు, చిమట రవివర్మ, గొడ్డళ్ల చిన్నరామారావు, దయాల రాజేశ్వరరావు, జాస్తి శ్రీధర్, మేడేపల్లి రమ బోడపాటి రవి, కొమ్మరాజు సుధీర్, పడమట రంగారావు, బాబూరావు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.



ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

సిద్ధార్థ లా కళాశాల విద్యార్థుల ప్రతిభ



కానూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): కృష్ణా విశ్వవిద్యాలయం అంతర్ కళాశాలల స్త్రీ, పురుషుల వెయిట్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో కానూరులోని సిద్ధార్థ న్యాయకళాశాల విద్యార్థులు ప్రతిభ కనపరిచారు. సోమవారం నగరంలో జరిగిన ఈ చాంపియన్‌షిప్ పోటీల్లో సిద్ధార్థ న్యాయ కళాశాలలో చదివే వి. శ్రీహిత అనే విద్యార్థిని 83 కేజీల క్యాటగిరీలో ద్వితీయ స్థానం సాధించారు. ఎస్‌కే నజీరా 63 కేజీల విభాగంలో ద్వితీయ స్థానం, జి. సౌమ్య 49 కేజీల క్యాటగిరీలో తృతీయ స్థానాన్ని కైవశం చేసుకున్నారు. ఈ సందర్భంగా మంగళవారం కానూరులోని సిద్ధార్థ న్యాయ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సీహెచ్ దివాకర్‌బాబు, ఫిజికల్ డైరెక్టర్ ఎం. సాంబశివరావుతోపాటు అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, తోటి విద్యార్థులు వెయిట్ లిఫింగ్‌లో ప్రతిభకనపరిచిన విద్యార్థులను అభినందించారు.

దరఖాస్తు చేసుకోండి

కంకిపాడు/ ఉయ్యూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : కంకిపాడు క్లస్టర్ పరిధిలోని ఖాళీగా ఉన్న అంగన్వాడీల్లో సహాయకురాలి పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసినట్లు సీడీపీవో సుకన్య తెలిపారు. స్థానిక విలేకరులతో మంగళవారం ఆమె మాట్లాడుతూ, కంకిపాడు మండలంలోని ఉప్ప లూరు - 3 (బీసీ - ఎ), పెనమలూరు మండలంలోని కానూరు 17 (ఓసీ), కానూరు - 6 (బీసీ- ఈ), పోరంకి - 7 (ఓసీ), తాడిగడప -2 (ఎస్సీ), తాడిగడప - 5 (ఓసీ), యనమలకుదురు - 11 (ఓసీ), యనమవలకుదురు -13 (బీసీ-ఈ), యనమలకుదురు - 2 (బీసీ - ఎ), పెనమలూరు - 3 (బీసీ - బీ), పోరంకి - 1 (ఎస్సీ), గంగూరు - 1 (ఎస్సీ), ఇండియన్ బ్యాంక్ (ఓసీ), హరి జనవాడ - 3 (ఎస్సీ), లంబాడీ పేట - 1 (ఎస్టీ), హరిజనవాడ - 1 (ఎస్సీ), కాటూరు రోడ్డు (బీసీ - బీ)లకు, ఉయ్యూరు మున్సిపాలిటీ పరిధిలోని ఇండియన్‌బ్యాంక్ ప్రాంతం 19, 20 వార్డులకు ఓసీ, ఎస్సీకాలనీ 5వ వార్డు ఎస్సీ, గిరిజనకాలనీ 15వ వార్డు ఎస్టీ, ఎస్సీ కాలనీ 4వ వార్డులో ఎస్సీ-3 , కాటూరు రోడ్డు 16వ వార్డులో బీసీ-బీ మహిళల నుంచి దరఖాస్తులు కోరుతు న్నట్టు తెలిపారు. పూర్తి చేసిన దరఖాస్తులను డిసెంబరు 3వ తేదీ సాయం త్రం 5 గంటల లోపు కంకిపాడు ఐసీడీఎస్ కార్యాలయంలో అందజేయాలని కోరారు.

చట్ట విరుద్ధంగా పిల్లలను పెంచుకోవటం నేరం

గన్నవరం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): చట్ట విరుద్ధంగా పిల్లలను పెంచుకోవటం నేరమని సచివాలయ సెక్రటరీ శివారెడ్డి అన్నారు. మండలంలోని సూరంపల్లి పంచాయతీ కార్యాలయం వద్ద చైల్డ్ రైట్స్ అడ్వకేసి ఫౌండేషన్ ఆధ్వర్యంలో జాతీయ దత్తత అవగాహన పోస్టర్‌ను మంగళవారం ఆవిష్కరించి సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మాతృత్వం ఒక వరమని అందుకు దత్తత మరో మార్గమన్నారు. చైల్డ్ రైట్స్ అడ్వకసి ప్రతినిధులు, అంగన్వాడీ టీచర్‌లు పాల్గొన్నారు.

క్లీన్ అండ్ గ్రీన్ విలేజ్‌పై అవగాహన

ఉంగుటూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : పర్యావరణాన్ని పరిశుభ్రంగా పచ్చగా మార్చడం ద్వారా గ్రామీణప్రాంతాల్లో ప్రజల ఆరోగ్యాన్ని మెరుగుపరిచేందుకు రాష్ట్రప్రభుత్వం చేపట్టిన థీమ్-5 క్లీన్ అండ్ గ్రీన్ విలేజ్ కార్యక్రమంలో అందరూ భాగస్వాములు కావాలని ఎంపీడీవో ఇ.సత్యకుమార్ అన్నారు. సంపూర్ణ స్వచ్ఛత, సుస్థిర అభివృద్ధి లక్ష్యాల స్థానికీకరణలో భాగంగా థీమ్-5 క్లీన్ అండ్ గ్రీన్ విలేజ్‌పై మంగళవారం ఉంగుటూరు మండల పరిషత్ కార్యాలయంలో మండలపరిధిలోని అన్ని గ్రామపంచాయతీల వీఓఏలు (బుక్‌కీపర్లు), ఎస్‌హెచ్‌జీ(డ్వాక్రా గ్రూపుల)లీడర్లకు ఒక్కరోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో జేవీఎస్ఆర్‌కే ప్రసాద్, ఈవోపీఆర్డీ వి.దిలీప్‌కుమార్, డీఆర్డీఏ (వెలుగు) ఏపీఎం సాంబశివ రావు, పంచాయతీ కార్యదర్శులు, వీఓఏలు, ఎస్‌హెచ్‌జీ సభ్యులు పాల్గొన్నారు.



పాఠశాలలో విచారణ చేస్తున్న డీవైఈవో శేఖర్ సింగ్

నాడు - నేడు నిధుల స్వాహాపై విచారణ

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

మోపిదేవి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మత్స్యకారుల ప్రభుత్వ ఆశ్రమ పాఠశాలలో నాడు-నేడు నిధుల దుర్వినియోగంపై మచిలీపట్నం డీవైఈవో శేఖర్ సింగ్ ఆధ్వర్యంలో ఇంజనీరింగ్ ప్రతినిధులు విచారణ చేపట్టారు. అక్టోబరు 14న నిధులు దోచేసి.. నిజాలు దాచేస్తున్నారని ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన వార్త కథనాన్ని ఇటీవల జిల్లా మంత్రులు వాసంశెట్టి సుభాష్, కొలుసు పార్థసారధి దృష్టికి పలువురు తీసుకెళ్లారు. దీనిపై జిల్లా విద్యాశాఖాధికారి ఆదేశాలతో డీవైఈవో ఆధ్వర్యంలో సమగ్ర శిక్షా అభియాన్ ఇంజనీరింగ్ అధికారులు శ్రీనివాసరావు, రాజేష్ మంగళవారం విచారణ నిమిత్తం పాఠశాలకు విచ్చేశారు. నాడు-నేడు ఫేజ్-2 పథకంలో భాగంగా పాఠశాలకు రూ.30లక్షల వరకు నిధులు మంజూరైనట్టు తెలిపారు. వాటిలో ఎంతమేర పనులు చేసింది, నిధులు డ్రా చేసిన వివరాలు, పేరెంట్స్ కమిటీ తీర్మానాలు పరిశీలించనున్నట్టు డీవైఈవో తెలిపారు. నిధులకు సంబంధించి కొంత మంది వ్యక్తుల పేరున చెక్కులు రాయటం, కమిటీ తీర్మానాలు, ఇంజనీరింగ్ అధికారుల అనుమతులు లేకుండా పనులు చేసినట్టు పలువురు డీవైఈవో దృష్టికి తీసుకొచ్చారు. గ్రామస్థుల విజ్ఞప్తులు, ఫిర్యాదులు దృష్టిలో పెట్టుకుని సమగ్రంగా విచారణ నిర్వహించనున్నట్టు డీవైఈవో తెలిపారు. ఈ నివేదికను కలెక్టర్, జిల్లా విద్యాశాఖాధికారికి అందిస్తామన్నారు. పాఠశాల పూర్వపు ప్రధాన ఉపాధ్యాయులు దుర్గాసాగర్, ఎంఈవోలు జీఎస్‌బీగోపాల్, ఏవీ రమణ, నాడు - నేడు ఏఈ రాంబాబు, సచివాలయ ఇంజనీరింగ్ సహాయకులు ఉన్నారు.



నేషనల్ లా డే సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయాధికారి గోపీ

రాజ్యాంగ పరిరక్షణ అందరి బాధ్యత

● జిల్లా ప్రధాన న్యాయాధికారి గోపీ

మచిలీపట్నం టౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగం ఎంతో ఉన్నతమని, రాజ్యాంగ పరిరక్షణ అందరి బాధ్యతని జిల్లా ప్రధాన న్యాయాధికారి జీ గోపీ అన్నారు. నేషనల్ లాడే సందర్భంగా మంగళవారం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. భారత రాజ్యాంగాన్ని అమలుచేయడంలో చిత్తశుద్ధి ఉండాలన్నారు. రాజ్యాంగం ద్వారా దేశప్రజలకు ఏ విధమైన హక్కులు, బాధ్యతలు ఏర్పడ్డాయో వివరించేందుకు ఒకరోజు న్యాయవాదులందరితో అవగాహన సదస్సు ఏర్పాటు చేస్తామన్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పోతురాజు అధ్యక్షత వహించిన ఈ సమావేశంలో 10వ అదనపు జిల్లా న్యాయాధికారి బాబూనాయక్, పోక్సో న్యాయాధికారి వెంకటేశ్వరరావుతో పాటు ఇతర న్యాయాధికారులు పాల్గొన్నారు. కాగా న్యాయవాదులు నున్న అరవిందకుమార్, కొండపల్లి వేణు, అమలేశ్వరరావు రాజ్యాంగం ప్రసాదించిన సమానత్వం, స్వేచ్ఛ వంటి అంశాలపై మాట్లాడారు. విద్యార్థులకు నిర్వహించిన పోస్టర్ మేకింగ్ పోటీల్లో లా విద్యార్థిని ఏ ప్రణతి గ్రేసీ, డీఎస్ఆర్ హిందూ లా కళాశాల విద్యార్థులు బీఎం హేమంత్, జే చందు, బీ నిఖితకు బహుమతులు అందించారు.



ఒప్పంద పత్రాలను మార్చుకుంటున్న కళాశాల యాజమాన్యం, పీఐ స్క్వేర్ సంస్థ ప్రతినిధులు

ధనేకుల, పీఐ స్క్వేర్ క్యూఎన్ఎక్స్ సంస్థల ఒప్పందం

పెనమలూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ధనేకుల ఇంజనీరింగ్ కళాశాల, పీఐ స్క్వేర్ సంస్థల మధ్య మంగళవారం ఒక అవగాహన ఒప్పందం జరిగిందని కళాశాల ప్రిన్సిపాల్ రవి కడియాల తెలిపారు. ఈ ఒప్పందంతో ఇండస్ట్రీ అకాడమియా భాగస్వామ్యాలు, అధ్యాపక, విద్యార్థుల పరిశోధనలు, ఆవిష్కరణలు, విద్యార్థులకు ఆటోమోటివ్ టెక్నాలజీస్, ఎంబెడెడ్ సైన్సు, అటానమస్ టెక్నాలజీస్ వంటి రంగాల్లో కళాశాల, పీఐ స్క్వేర్ సంస్థ పరస్పర అవగాహనతో ముందుకు వెళ్లనున్నట్టు తెలిపారు. కళాశాల చైర్మన్ ధనేకుల ఠాగూర్, సెక్రటరీ ధనేకుల భవానీప్రసాద్, డాక్టర్ వంశీకృష్ణ పాల్గొన్నారు.

ప్రపంచ కప్ గెలవడం ఆనందంగా ఉంది.

● కానీ జట్టులో లేకపోవడం ఎంతో బాధను కలిగిస్తుంది

● సీనియర్ కబడ్డీ క్రీడాకారిణి గౌరి



విజయవాడ స్పోర్ట్స్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): క్రీడా సంఘాల మధ్య వివాదాలు తనను మహిళా కబడ్డీ వరల్డ్ కప్‌లో లేకుండా చేశాయని కబడ్డీ సీనియర్ క్రీడాకారిణి కొప్పన గౌరి ఆవేదన వ్యక్తం చేశారు. ప్రపంచ మహిళా కబడ్డీలో భారత జట్టు చైనీస్ తాపియాపై విజయం సాధించి విశ్వవిజేతగా నిలిచిన సందర్భంలో జట్టులో రాష్ట్రం నుంచి ఒక క్రీడాకారిణి జట్టులో లేకపోవడం ఆవేదన కలిగిస్తోందన్నారు. తాడేపల్లిగూడెంకు చెందిన జాతీయ కబడ్డీ క్రీడాకారిణి గౌరి కబడ్డీ జట్టు ఎంపికలో చివరి 24 మందిలో చోటు సంపాదించినా అసోసియేషన్ల వివాదంలో చిక్కుకుని స్థానాన్ని కోల్పోయానంది. ప్రపంచ కప్ మహిళా జట్టులో చివరి 14 మందిలో స్థానం కోసం ఎంతో కృషి చేశానని, కబడ్డీ అసోసియేషన్ల ఆధిపత్య పోరులో తాను బలైపోయానన్నారు. ప్రస్తుతం తాను బీచ్ ఇండియాకు ఎంపికయ్యానని తెలిపింది. అసోసియేషన్లు తమ ఆధిపత్య పోరును క్రీడాకారులపై రుద్ది వారి భవిష్యత్తును నాశనం చేయవద్దని కోరింది. దీనిపై ప్రభుత్వం దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని కోరింది.

వృద్ధురాలిపై దాడి.. బంగారు గొలుసు అపహరణ

మచిలీపట్నం టౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక కాలేఖాన్‌పేట నుంచి రాజాసెంటర్‌కు వెళ్లేందుకు ఆటో ఎక్కిన వృద్ధురాలు కాగిత కృష్ణవేణిని ఆటో డ్రైవర్ దారుణంగా కొట్టి మెడలోని బంగారు గొలుసు అపహరించాడు. ఇనకుదురు ఎస్ఐ సుబ్రహ్మణ్యం అందించిన వివరాలిలా ఉన్నాయి. మంగళవారం తెల్లవారుజామున కాగిత కృష్ణవేణి రాజాసెంటర్‌లోని ఒక హోటల్‌లో పనిచేసేందుకు వెళుతోంది. ఎదురుగా కనబడిన ఆటోలో ప్రయాణం చేస్తుండగా ఆటోడ్రైవర్ కాలేఖాన్‌పేట నుంచి బైపాస్‌రోడ్డు వరకు తీసుకుని వెళ్లి ఇనుప రాడ్డుతో విచక్షణారహితంగా తలపై కొట్టి గాయపరిచాడు. మెడలోని బంగారు గొలుసును తీసుకుని ఆటోతో పరారయ్యాడు. గాయపడిన కృష్ణవేణిని మచిలీపట్నం జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఇనకుదురు ఎస్ఐ సుబ్రహ్మణ్యం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ధాన్యం.. దైన్యం

● గ్రామాల్లో పేరుకుపోయిన ధాన్యం నిల్వలు ● కాటాలు వేసి వారం రోజులుగా లారీల కోసం ఎదురుచూపులు
● చేతులెత్తేసిన రైతు సేవా కేంద్రం నిర్వాహకులు ● వాయుగుండం వార్తలతో రైతుల గుండెల్లో గుబులు

కూచిపూడి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): తుఫాను హెచ్చరికల నేపథ్యంలో యంత్రాల సాయంతో రైతులు విస్తారంగా వరి నూర్పిళ్లు చేపట్టారు. గ్రామాల్లో ఎక్కడ చూసినా ధాన్యం నిల్వలే. కాటాలు వేసి వారం రోజులుగా కాపలా కాస్తున్నా లారీలు సకాలంలో రాకపోవడంతో ఎదురుచూపులు చూస్తున్నారు. మరోపక్క నూర్చిన ధాన్యం కాటా వేద్దామంటే రైతు సేవా కేంద్రాల్లో సంచుల కొరత ఏర్పడింది. ప్రస్తుతానికి ధాన్యం దిగుమతి చేసుకోవటం లేదని మిల్లర్లు పేర్కొనటంతో రైతులు అయోమయానికి గురవుతున్నారు. మండలంలో పలు గ్రామాల్లోని రైతులు తమ కష్టాలను ఎన్టీఆర్ కలెక్టర్ బాలాజీ, మంత్రి నాదెళ్ల మనోహర్‌కు నేరుగా ఫిర్యాదులు చేస్తున్నారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. తేమశాతం తగ్గించటానికి గ్రామాల్లోని ఖాళీ ప్రదేశాల్లో రైతులు పగలంతా ధాన్యాన్ని అరబెట్టుకుంటూ సాయంత్రానికి పరదాలు కప్పుతున్నారు. భట్లపెనుమర్రు, అయ్యంకి, నిడుమోలు, మంత్రిపాలెం, పెడసనగల్లు, కూచిపూడి, మొవ్వ, పెదపూడి తదితర గ్రామాల్లో ఎక్కడ చూసినా కాటాలు వేసి సంచులకు ఎత్తిన ధాన్యం, కాటాలు వేయటానికి నూర్చి సిద్ధంగా ఉంచిన ధాన్యం రాశులే కనిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో రైతులు దళారులను ఆశ్రయించక తప్పని పరిస్థితులు నెలకొన్నాయి. ఇదే అదనుగా రూ.1300, రూ.1400కే కొనుగోలు చేస్తామని చెప్పటంతో రైతుల పరిస్థితి ముందు నుయ్యి, వెనుక గొయ్యిగా మారింది. రైతు సేవా కేంద్ర నిర్వాహకులు సైతం దళారులకు అమ్ముకోవాలంటూ ప్రోత్సహిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. భట్లపెనుమర్రుకు చెందిన అంగడాల నగేష్ అనే కౌలు రైతు తనకు ధాన్యం అమ్మకాల్లో ఎదురవుతున్న సమస్యలపై సోమవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.



అయ్యంకి



పెడసనగల్లు



భట్లపెనుమర్రులో కాటాలు వేసి లారీల్లో ఎక్కించేందుకు ధాన్యపు బస్తాలను సిద్ధం చేసిన రైతులు



ధాన్యాన్ని నూర్చి వారమైంది..

వీరంకి జోగేశ్వరరావు, భట్లపెనుమర్రు

ధాన్యం నూర్చి వారం రోజులైంది. గ్రామంలోని రైతు సేవా కేంద్రానికి వెళ్లగా, లారీలు రావటం లేదు. ప్రస్తుతం మిల్లర్లు కొనుగోళ్లు ఆపివేసినట్టు చెబుతున్నారు. 13 ఎకరాల్లో నూర్చి ధాన్యాన్ని రోజు ఆరబెట్టుకుంటున్నారు. చేసేదేం లేక దళారీకి రూ.1460కు అమ్ముకుంటున్నాం

ఖర్చులు కూడా రావటం లేదు



దేవరపల్లి వెంకటేష్, కౌలు రైతు

కాటా వేసి నాలుగు రోజులైంది. లారీలు రావటం లేదు. ప్రతిరోజు ధాన్యం బస్తాలకు కాపలా కాయాల్సి వస్తోంది. మిల్లర్లు దిగుమతి చేసుకోవటం లేదని రైతు సేవా కేంద్రం సిబ్బంది చెబుతున్నారు. మరోపక్క సంచుల కొరత తీవ్రంగా ఉంది. మారిన వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో ఆందోళనగా ఉంది.

ఆర్టీసీ డ్రైవర్లపై దాడులు ఆపాలి

జగ్గయ్యపేటలో మెరుపు సమ్మెకు దిగిన ఆర్టీసీ హైర్ బస్సు డ్రైవర్లు, యజమానులు

జగ్గయ్యపేట, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్టీసీ డిపోలో హైర్ బస్సు డ్రైవర్లుగా పనిచేస్తున్న ఇద్దరిపై వరుసగా రెండు రోజులుగా జరిగిన దాడులకు నిరసనగా మంగళవారం ఆర్టీసీ హైర్ బస్సు డ్రైవర్లు, యజమానులు మెరుపు సమ్మెకు దిగారు. విజయవాడ రూట్‌లో హైర్‌బస్సుకు డ్రైవర్‌గా వెళ్లిన వత్సవాయి మండలం సింగవరం గ్రామానికి చెందిన బొడ్డు వీరబాబు (38)తో విజయవాడ నుంచి బయల్దేరే సమయంలో అమర్లపుడి సారథి అనే వ్యక్తి పూల కవర్ల విషయమై గొడవపడ్డాడు. ముందువరుస సీటులో వద్దని వెనక్కి వెళ్లి కూర్చోవాలని వీరబాబు కోరటంతో సారథి బెదిరిస్తూ వెనక్కివెళ్లాడు. జగ్గయ్యపేటకు చేరుకున్న తరువాత బస్సులోనే డ్రైవర్ భోజనం చేస్తుండగా సారథి అతడి కుమారుడు మరో ఇద్దరు వ్యక్తులు కలిసి పదునైన ఆయుధంతో విచక్షణరహితంగా దాడిచేయటంతో తప్పించుకునే ప్రయత్నంలో ముక్కు పగిలి రక్త గాయమైంది. వెంటనే తనతో వచ్చిన కండక్టర్, బస్టాండ్‌లోని ప్రయాణికులు అడ్డుకోవటంతో పరారైయ్యారు. అలాగే విజయవాడ నుంచి సోమవారం రాత్రి పేట వస్తుండగా బస్ పాయింట్ వద్ద ఆటోలు అడ్డుగా ఉండటంతో తీయాలని డ్రైవర్ బాషా ఆటోడ్రైవర్‌ను మందలించటంతో వాగ్వాదం జరిగింది. అనంతరం బస్టాండులో ప్రయాణీకులను దింపి డిపోకు వెళ్లగా రెండు ఆటోల్లో 10 మందికి పైగా ఆటోడ్రైవర్లు డిపో లోపలకు వచ్చి దాడి చేశారు. డిపోలోని మెకానిక్‌లు, సిబ్బంది అడ్డుకోవటంతో వెనక్కి తగ్గారు. ఈ రెండు ఘటనలు హైర్ బస్సు డ్రైవర్లు కావటంతో యజమానులు మంగళవారం ఉదయం ఆందో ళన చేపట్టారు.



నేతలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీ రాం తాతయ్య

తెల్లవారుజాము 5 గంటల నుంచి విజయవాడ వెళ్లే హైర్ ఎక్స్‌ప్రెస్ బస్సులు, పల్లె వెలుగు బస్సులు 32 సర్వీసులు నిలిచిపోయాయి. ఆర్టీసీ సొంత బస్సులు మాత్రమే తిరిగాయి. బస్టాండ్‌లో ఎంతకీ బస్సులు రాకపోవటంతో విజయవాడ వెళ్లే ప్రయాణికులు గందరగోళానికి గురయ్యారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య అక్కడకు చేరుకుని కార్మిక సంఘాలు, ఆర్టీసీ హైర్ బస్సుల యజమానులతో చర్చలు జరిపారు. కార్మిక నేతలు ఆయా వివరాలు ఎమ్మెల్యేకు వివరించారు. షేర్ మహ్మద్‌పేట సంఘటనలో పోలీసుల అనుసరించిన వైఖరిపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే సమక్షంలో ఎస్సై రాజు కార్మిక నేతల డిమాండ్ మేరకు దోషులను వెంటనే పట్టుకుని అరెస్టు చేస్తామని హామీ ఇచ్చారు. ఆర్టీసీ డిపో మేనేజర్ రఘురాం మరో 4 బస్సులను విజయవాడ రూట్‌లో పెంచుతామని హామీ ఇచ్చారు. ఈ హామీలతో ఉదయం 9-30 నుంచి నుంచి బస్సులను తిప్పటంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు.

క్రీడలతో మానసిక, శారీరక వికాసం

● త్వరలోనే జాతీయస్థాయి క్రీడలకు వేదికగా మచిలీపట్నం

● రాష్ట్ర స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలను ప్రారంభించిన ఆర్టీసీ చైర్మన్

మచిలీపట్నం టౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): క్రీడలకు ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యత ఇస్తోందని ఆర్టీసీ చైర్మన్, మాజీ ఎంపీ కొనకళ్ల నారాయణరావు అన్నారు. మచిలీపట్నం ఈడేపల్లిలో నూతనంగా నిర్మించిన ఇండోర్ స్టేడియంలో మొట్టమొదటసారిగా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మంగళవారం రాష్ట్ర స్థాయి షటిల్ బ్యాడ్మింటన్ పోటీలను ఆయన ప్రారంభించి ప్రసంగించారు. పద్మశ్రీ సీకే నాయుడు వంటి ప్రముఖ క్రీడాకారులకు పుట్టినిల్లయిన మచిలీపట్నం జాతీయ స్థాయి క్రీడలకు వేదిక కావడడం ముదావహమన్నారు. రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు ముగిసిన మరునాడే రాష్ట్రస్థాయి షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. క్రీడల ద్వారా శారీరక మానసిక వికాసం కలుగుతుందన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గొర్రెపాటి గోపీచంద్ మాట్లాడుతూ గతం ప్రభుత్వంలో ఇండోర్ స్టేడియాన్ని నాణ్యత లేకుండా నిర్మించారని, మోకాలు లోతు నీటిలో ఉన్న స్టేడియంను మెరక చేయించే పనిని పీవీ ఫణికుమార్ ప్రారంభించారన్నారు. ఓట్ల కోసం కాకుండా పశువైద్యశాలను మెరక చేయించారన్నారు. డీఈవో పీవీజే రామారావు మాట్లాడుతూ కృష్ణాజిల్లాలోని పాఠశాలల్లో క్రీడలకు తగిన ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ పీవీ ఫణికుమార్ మాట్లాడుతూ మంత్రి కొల్లు రవీంద్ర క్రీడా శాఖ మంత్రిగా ఉన్నప్పుడు స్టేడియానికి కేటాయించిన స్థలాన్ని వైసీపీ పాలకులు ఇతర వాటికి డైవర్ట్ చేశారన్నారు. బందరు డీవైఈవో సింగ్, స్పోర్ట్స్ ఆఫీసర్ ఝాన్సీ లక్ష్మి, వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎస్ గంగాధర్, ఎస్‌జీఎఫ్ సెక్రటరీ ఎం అరుణ, జీ నరసింహారావు, పరిశీలకుడు రవిప్రకాష్ రెడ్డి, వెంకటస్వామి పాల్గొన్నారు. కాసేపు ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు, గోపీచంద్, డీఈవో రామారావు, పీవీ ఫణికుమార్ బాల్ బ్యాడ్మింటన్ ఆడి క్రీడాకారులకు స్ఫూర్తినిచ్చారు. ఇదిలా ఉండగా ఇండోర్ స్టేడియానికి వందలాది క్రీడాకారులు వచ్చిన నేపథ్యంలో సరైన మరుగుదొడ్లు లేక ఇతర జిల్లాల నుంచి వచ్చిన క్రీడాకారులు ఇబ్బందులకు గురయ్యారు.



రాష్ట్ర బాల్‌బ్యాడ్మింటన్ పోటీలు ప్రారంభిస్తున్న ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు

రైతన్నా.. వస్తున్నాం.. మీకోసం..!

● అన్నదాతల సాధికారత డిసెంబరు 2 వరకు నిర్వహణ: కలెక్టర్ లక్ష్మీశ

కలెక్టరేట్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): అన్నదాతల సాధికారత లక్ష్యంగా సోమవారం నుంచి డిసెంబరు 2 వరకు 'రైతన్నా.. మీకోసం..' నిర్వహిస్తున్నట్టు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. వ్యవసాయ, వివిధ శాఖల అధికారులతో కలిసి కలెక్టర్ కార్యాలయంలో రైతన్నా.. మీకోసం పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయరంగ పరిపుష్టికి, స్వర్ణాంధ్ర-2047 సాధనకు, రైతును రాజును చేసేందుకు సీఎం చంద్రబాబు దార్శనికతకు అద్దం పడుతూ రాష్ట్రంలోని అన్ని రైతు సేవా కేంద్రాల పరిధిలోని సిబ్బంది, వ్యవసాయ అనుబంధ శాఖలు, శాస్త్రవేత్తల సమన్వయంతో నవంబరు 24నుంచి డిసెంబరు 2వరకు రైతన్నా మీకోసం ద్వారా ఇంటింటికీ వెళ్లి రైతులను ప్రత్యక్షంగా కలిసి సీఎం సందేశం, రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అండగా ఉంటుందని చెబుతూ కరపత్రం అందజేయడంతో పాటు, ముఖాముఖి చర్చ నిర్వహిస్తామన్నారు.



పోస్టరును ఆవిష్కరిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

సమష్టి కృషితోనే సమగ్రాభివృద్ధి సాధ్యం

సమష్టి కృషితోనే సమగ్రాభివృద్ధి సాధ్యమని, జిల్లా అభివృద్ధిలో ఉద్యోగులు అందిస్తున్న సహకారం మరువలేనిదని ప్రజలకు పారదర్శకమైన సేవలందించి ప్రభుత్వ లక్ష్యాల సాధనలో భాగస్వాములు కావాలని కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. కలెక్టర్‌గా పదవీ బాధ్యతలు చేపట్టి ఏడాది పూర్తిచేసుకొన్న సందర్భంగా ఏపీ ఎన్జీవో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు డీ సత్యనారాయణరెడ్డి, సహాధ్యక్షుడు వేమూరి ప్రసాద్, కార్యదర్శి డీ రమేష్, నగరాధ్యక్షుడు సీవీఆర్ ప్రసాద్ ఆధ్వర్యంలో జిల్లా, నగర కార్యవర్గసభ్యులు మంగళవారం కలెక్టర్ విడిది కార్యాలయంలో కలెక్టర్ లక్ష్మీశను మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉద్యోగులకు ఎదురయ్యే సమస్యలను తన దృష్టికి తీసుకొస్తే పరిష్కరించడంలో ఎప్పుడూ ముందుంటానని భరోసా కల్పించారు. ఏపీ ఎన్జీవో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు డీఎస్ఎన్ రెడ్డి మాట్లాడుతూ జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి వైపు పరుగులు పెట్టిస్తూ ప్రజల కలెక్టర్‌గా పేరు తెచ్చుకోవడం ఉద్యోగులకు గర్వకారణమన్నారు.

ఈవీఎం, వీవీ ప్యాట్ గోదాముకు పటిష్ఠ భద్రత

ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషిన్లు (ఈవీఎం), వీవీ ప్యాట్ల గోదాముకు పటిష్ఠ భద్రత ఏర్పాటు చేశామని, నిరంతరం అప్రమత్తంగా ఉండాలని అధికారులను కలెక్టర్ లక్ష్మీశ ఆదేశించారు. ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా ఆదేశాలు, మార్గదర్శకాలకు అనుగుణంగా సాధారణ నెలవారీ తనిఖీల్లో భాగంగా గొల్లపూడిలోని ఈవీఎం, వీవీ ప్యాట్ల గోదామును కలెక్టర్ మంగళవారం అధికారులతో కలిసి పరిశీలించారు. సీసీ కెమేరాల పనితీరుతో పాటు అగ్నిమాపక పరికరాలను పరిశీలించారు. అనంతరం పర్యవేక్షణ రిజిస్టర్‌లో సంతకం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గోదాము వద్ద విధులు నిర్వహిస్తున్న పోలీసు సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉంటూ సీసీ కెమెరాల పర్యవేక్షణతో గట్టి నిఘా ఉంచాలని సూచించినట్లు పేర్కొన్నారు. డీఆర్‌వో ఎం లక్ష్మీ నరసింహం పాల్గొన్నారు.

పనుల్లో నిర్లక్ష్యాన్ని సహించేది లేదు

ప్రభుత్వ ప్రతిష్ఠాత్మక పథకాలకు సంబంధించిన విస్తృత ప్రజా ప్రయోజనాలతో ముడిపడిన పనుల పురోగతిలో నిర్లక్ష్యాన్ని, జాప్యాన్ని సహించేది లేదని కలెక్టర్ లక్ష్మీశ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జల్‌జీవన్ మిషన్‌తో పాటు వివిధ ప్రభుత్వ ప్రతిష్ఠాత్మక పథకాల అమల్లో తీవ్ర అలసత్వం ప్రదర్శించినట్టు గుర్తించినందున, లక్ష్యాలను చేరుకోవడంలో విఫలమవుతున్నందున, జిల్లా గ్రామీణ నీటి సరఫరా (ఆర్‌డబ్ల్యుఎస్) సూపరింటెండెంట్ ఇంజనీర్ ఎస్ విద్యాసాగర్‌ను ప్రభుత్వానికి సరెండర్ చేశామని, జిల్లా పంచాయితీరాజ్ సూపరింటెండెంట్ ఇంజనీర్‌కు ఆర్‌డబ్ల్యూఎస్ ఇన్‌చార్జి ఎస్ఈగా అదనపు బాధ్యతలు అప్పగించినట్టు తెలిపారు. వివిధ ప్రాజెక్టుల పనులకు అదనపు నిధులను మంజూరు చేసినా ముందుకు తీసుకెళ్లడంలో విద్యాసాగర్ విఫలమయ్యారన్నారు. ఆకాంక్షిత బ్లాకుల కీలక ప్రగతి సూచికల్లో పురోగతి విషయంలోనూ పనితీరు సరిగా లేదన్నారు.

స్త్రీలపై హింసకు వ్యతిరేకంగా ప్రచారోద్యమం

● దళితస్త్రీ శక్తి

గవర్నర్‌పేట, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): సాంకేతిక పరిజ్ఞానాన్ని దుర్వినియోగం చేస్తూ మహిళలను బ్లాక్‌మెయిల్ చేస్తున్న విష సంస్కృతి సమాజంలో పెరిగిపోయిందని, ముఖ్యంగా యువతులు అప్రమత్తంగా ఉండాలని ఐఏఎస్ అధికారిణి కాకి సునీత అన్నారు. ఐక్యరాజ్య సమితి పిలుపు మేరకు స్త్రీలపై జరుగుతున్న హింసకు వ్యతిరేకంగా దళిత స్త్రీ శక్తి సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం ప్రారంభమైన అంతర్జాతీయ ప్రచారోద్యమంలో భాగంగా లెనిన్ సెంటర్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌రామ్ ఐక్యవేదికలో సమావేశం నిర్వహించారు. అనంతరం జరిగిన ర్యాలీని కాకి సుజాత జెండా ఊపి ప్రారంభించారు. సమావేశంలో సునీత మాట్లాడుతూ ఈ ఏడాది జండర్ సమానత్వంపై ప్రచారోద్యమం ముఖ్య ఉద్దేశం డిజిటల్ హింసను రూపుమాపడమేనన్నారు. ప్రపంచ వ్యాప్తంగా దీనిపై ప్రచారోద్యమం జరుగుతోందన్నారు. సభకు అధ్యక్షత వహించిన దళిత స్త్రీశక్తి జాతీయ కన్వీనర్ ఝాన్సీ గెడ్డం మాట్లాడుతూ స్త్రీలపై జరుగుతున్న హింసకు వ్యతిరేకంగా 19ఏళ్లుగా ప్రచారోద్యమాన్ని నిర్వహిస్తున్నట్టు వెల్లడించారు. నేటి నుంచి డిసెంబరు 10 వరకు 16 రోజుల పాటు రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ పాఠశాలలు, కళాశాలల్లో, గ్రామీణ ప్రాంతాలు, పేదలు ఎక్కువగా నివసించే మురికివాడల్లో జండర్ సమానత్వంపై సభలు, సమావేశాలు నిర్వహిస్తామన్నారు. నాగార్జున వర్శిటీ ప్రొఫెసర్ సరస్వతీ అయ్యర్ మాట్లాడుతూ స్త్రీలు అత్యంత శక్తివంతులుగా మారాలని, హక్కుల సాధనకు పోరాటం తప్పనిసరి అన్నారు. లయోలా కళాశాల ఉమెన్ సెల్ డైరెక్టర్ ప్రొఫెసర్ తబిత మాట్లాడుతూ స్త్రీలపై జరిగే శారీరక హింస, మానసిక హింసను నిర్మూలించాలంటే ఒక్కరిగా కాకుండా సమైక్యంగా పనిచేయాలన్నారు. సైకాలజిస్ట్ రమాదేవి, దళిత స్త్రీశక్తి కృష్ణాజిల్లా కో-ఆర్డినేటర్ ప్రసన్న, వివిధ జిల్లాల నుంచి మహిళా కలయిక నేతలు పాల్గొన్నారు.



జండర్ సమానత్వంపై జరిగిన ర్యాలీని ప్రారంభిస్తున్న సునీత



బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	122, 131, 142
చికెన్ విత్ స్కిన్	232
చికెన్ స్కిన్‌లెస్	242

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 660

నివేదనశాల నిర్మాణానికి తీర్మానం

గుడివాడ, నవంబరు25(ఆంధ్రజ్యోతి) : స్థానిక విఘ్నేశ్వరస్వామి దేవస్థానంలో ఆలయ దక్షిణం వైపున నివేదనశాల, దేవస్థాన కార్యాలయ నిర్మాణాన్ని దాతల సాయంతో నిర్మించాలని ధర్మకర్తల మండలి సభ్యులు ఏకగ్రీవ తీర్మానం చేశారు. మంగళవారం స్థానిక దేవస్థాన ఆవరణలో ధర్మకర్తల మండలి సమావేశం చైర్మన్ సాయన రాజేష్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా రెండు నెలల కాలానికి సంబంధించిన జమాఖర్చులకు ఆమోదం తెలిపారు. దేవస్థాన ఈవో యార్లగడ్డ శ్రీనివాసరావు, ధర్మకర్తలు లోయ వాసు, ముళ్లపూడి రమణమూర్తి, వీరమాచినేని శైలజ, సాసుపల్లి శారద, విజయలక్ష్మీ, గొంతుపులి కనకదుర్గా భవాని తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న దేవస్థాన కమిటీ సభ్యులు



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ కుసుమకుమారి

ఓటర్ల జాబితాపై అవగాహన

తోట్లవల్లూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : తోట్లవల్లూరు మండలంలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్(సర్) కార్యక్రమాన్ని బీఎల్వోలు విజయవంతంగా నిర్వహించాలని తహసీల్దార్ ఎం కుసుమకుమారి అన్నారు. ఎన్నికల సంఘం ఆదేశాలపై తహసీల్దార్ కార్యాలయం వద్ద మంగళవారం సర్ కార్యక్రమంపై బీఎల్వోలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. 2002 ఓటర్ల జాబితాలను 2025 ఓటర్ల జాబితాలతో ఎలా పరిశీలన చేయాలని, నాటి ఓటర్ల బంధువులు ప్రస్తుత జాబితాలో ఉన్నారా లేదా, ఎలాంటి బంధం లేని ఓటర్లు ఎవ్వరైనా ఉన్నారా అనే అంశాలపై బీఎల్వోలకు అవగాహన కల్పించారు. బీఎల్వోల యాప్‌లో ఈ పరిశీలన చేయవచ్చన్నారు. డిప్యూటీ తహసీల్దార్ సత్యనారాయణ పలు అంశాలను వివరించారు.

అడుసుమిల్లి సేవలు ఎనలేనివి



గుడ్లవల్లేరు : జాతీయ ఉత్తమ గ్రామపంచాయతీగా ఎంపికైన గుడ్లవల్లేరు అభివృద్ధిలో అడుసుమిల్లి అశ్వర్థనారాయణమూర్తి చేసిన సేవలు ఎనలేనివని అడుసుమిల్లి అశ్వర్థనారాయణ మూర్తి ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ వల్లూరుపల్లి రామకృష్ణ తెలిపారు. అడుసుమిల్లి 120వ జయంతిని పుర్కరించుకుని బుధవారం స్థానిక కేడీసీసీ బ్యాంక్ కార్యాలయంలో అశ్వర్థనారాయణమూర్తి, కృష్ణా కోఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్ వ్యవస్థాపకులు డాక్టర్ బోగరాజు పట్టాభి సీతారామయ్యల విగ్రహాలను ఆవిష్కరించనున్నామన్నారు. విగ్రహాల ఆవిష్కరణ లకు అతిధులుగా కృష్ణా జిల్లా కో-ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్ చైర్మన్ నెట్టెం రఘురామ్, గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, ఏపీఎస్‌డబ్ల్యూసీ చైర్మన్ రావి వెంకటేశ్వరరావులు హాజరుకానున్నారని ఆయన తెలిపారు. ప్రతీ ఏటా సేవాకార్యక్రమాలను పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహించనున్నామని రామకృష్ణ తెలిపారు.

దీక్షాపరులకు భిక్ష

గుడివాడ : స్థానిక బంటుమిల్లిరోడ్డులో వేంచేసి యున్న వీరాంజనేయస్వామి దేవస్థానంలో మంగళవారం హనుమాన్ భక్త బృందం ఆధ్వర్యంలో హనుమాన్, సాంబశివ, అయ్యప్పస్వామి దీక్షాపరులకు, భక్తులకు భిక్షను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన ఈవో యార్లగడ్డ శ్రీనివాసరావు(వాసు), గురుస్వాములు కూరాకుల బాబీ, కె.వీరబాబు, దాతలు దిమ్మిటి రాజేంద్రప్రసాద్, దిమ్మిటి రమేష్, కాళీ, ఆంజనేయులు, సుబ్రహ్మణ్యం, తరుణ్, మీనాక్షి, అభిషేక్ పావని, విశాల్, గోవిందరాజు, సావిత్రి, వెంకన్న, సురేష్, కోటి, రామకృష్ణారెడ్డి, శేఖర్, ఆలయ కమిటీ సభ్యులు, భక్త బృందం తదితరులు పాల్గొన్నారు.

అన్నదాతకు కూటమి ప్రభుత్వం అండ

● ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా



రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా

పమిడిముక్కల, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): రైతు పండించిన ప్రతిధాన్యం గింజనూ ప్రభుత్వం కొనుగోలు చేసి అన్నదాతకు అండగా నిలుస్తుందని, కొనుగోలుకు సంబంధించి ఏవిధంగా అధైర్య పడవద్దని ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా అన్నారు. రైతన్నా నీకోసం కార్యక్రమంలో భాగంగా మంగళవారం అగినపర్రులో పర్యటించి రైతులతో మాట్లాడారు. పక్వానికి వచ్చిన ధాన్యం మాత్రమే కోతకోయించాలని, తొందరపడి తయారు కాని పంట కోసి ఇబ్బందులు పడవద్దని సూచించారు. వాతావరణం పెద్దగా మార్పు ఉండదని అధైర్యపడి పంట ముందుగా కోతకోయించ వద్దన్నారు. మిల్లు, ఆర్ఎస్‌కేల వద్ద ఏమైనా ఇబ్బంది కలిగితే తెలియపరచాలన్నారు. ధాన్యం ఆరబెట్టి నిర్ణీత తేమశాతం ఉన్నప్పుడే రైతు సహాయకేంద్రానికి శాంపిల్ తీసుకువెళ్లి షెడ్యూల్ చేయించి మిల్లుకు తొలాలని సూచించారు. కూటమి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

గుడివాడ రూరల్ : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు రైతన్నా మీకోసం కార్యక్రమం ద్వారా వివరించనున్నామని మండల వ్యవసాయాధికారిణి బోలెం అనంతలక్ష్మీ అన్నారు. మంగళవారం బొమ్ములూరు తదితర గ్రామాల్లో రైతన్నా మీ కోసం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బొమ్ములూరులో ఇంటింటికీ తిరిగి ప్రభుత్వం ఏ విధంగా లబ్ధి చేకూరుస్తుందో వివరించారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖాధికారులు, రైతులు పాల్గొన్నారు.

పమిడిముక్కల : రైతన్నా నీకోసం కార్యక్రమంలో భాగంగా వ్యవసాయ అధికారులు మంగళవారం గోపువాని పాలెంలో పర్యటించి రైతుల సమస్యలు అడిగితెలుసుకున్నారు. ఈ సందర్భంగా డీఏవో పద్మావతి మాట్లాడుతూ రైతుల సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం పలు పథకాలు అమలుచేస్తుందన్నారు. రాబోయే ఐదు సంవత్సరాల్లో నీటి భద్రత, డిమాండ్ ఆధారిత పంటలు, అగ్రిటెక్, ఫుడ్ ప్రాసెసింగ్ , ప్రభుత్వ మద్దతు అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. ఏడీఏ సునీల్, ఏవో గణేశ్‌రెడ్డి, వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.



బొమ్ములూరులో..



చినగొన్నూరులో..

గుడ్లవల్లేరు : వ్యవసాయంలో తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడులతో ప్రతి రైతుకీ మంచి ఆదాయం చేకూరాలని కూటమి ప్రభుత్వం రూపకల్పన చేసిందని కాపు కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ సాయిన పుష్పావతి అన్నారు. మంగళవారం రైతన్నా మీకోసం కార్యక్రమంలో భాగంగా వ్యవసాయాధికారులు, వీఆర్‌వోలతో కలసి చినగొన్నూరులో ప్రతి రైతూ ఇంటికి వెళ్లి స్వర్ణాంధ్రా 2047 భాగంగా రాష్ట్రంలో వ్యవసాయంలో వినూత్న పద్ధతులపై అవగాహన కల్పించి, కరపత్రాల పంపిణీ చేశారు. అలానే గుడ్లవల్లేరు గ్రామంలోనూ రైతలకు ఇంటింటికీ వెళ్లి టీడీపీ గ్రామ నేతలు కరపత్రాలను పంపిణీ చేశారు. గుడ్లవల్లేరు మార్కెట్ కమిటీ చైర్మన్ పొట్లూరి రవికుమార్, గుడ్లవల్లేరు టీడీపీ గ్రామ అధ్యక్షుడు వల్లభనేని రంగబాబు, వీఆర్వో ప్రకాష్, నీటిసంఘం అధ్యక్షుడు సాయిన ప్రసాద్, వీఏఏ వెంకటేష్ , పంచాయతీ కార్యదర్శి కె.వెంకటేశ్వరరావు, టీడీపీ గ్రామ అధ్యక్షుడు కోటప్రోలు ఆనంద్, టీడీపీ గ్రామ కార్యదర్శి వి.మోహనరావు పాల్గొన్నారు.



అధికారులకు సూచనలిస్తున్న ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్

గ్రామాల అభివృద్ధే ధ్యేయం

●ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్

పామర్రు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధే ధ్యేయమని, దీనికి 15వ ఆర్థిక సంఘ నిధులు దోహదంగా నిలుస్తాయని ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్ పేర్కొన్నారు. పామర్రు గ్రామ పంచాయతీ పరిధిలో ఆ సంఘ నిధులు రూ.20లక్షలతో ప్రారంభమైన ఆర్‌డబ్ల్యూఎస్ పనులను సర్పంచ్ కె. కస్తూరితో కలసి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పన, పారిశుధ్యం వంటి అభివృద్ధి పనుల నిర్వహణ నిమిత్తం కేంద్రం గ్రామ పంచాయతీలకు, మండల, జిల్లాపరిషత్తులకు నిధులను విడుదల చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఆరుమళ్ల రమాదేవి, ఇంజనీర్ సహాయకులు నవీన్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ

గుడ్లవల్లేరు: చలికాలం ప్రారంభమైన నేపథ్యంలో పెంజంద్రకు చెందిన సామాజిక సేవకుడు ఈశ్వర్ పలు గ్రామాల్లో దుప్పట్లు పంపిణీ చేశారు. పెంజంద్ర, గుడ్లవల్లేరు, విన్నకోట గ్రామాల్లో పలు ప్రాంతాల్లో పేదలకు 150 కి పైగా దుప్పట్లను పంపిణీ చేశారు.

ఆధునిక పద్ధతులతో ఆక్వారంగం అభివృద్ధి

● ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

నందివాడ, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఆధునిక పద్ధతుల వల్లే ఆక్వా రంగంలో అభివృద్ధి సాధ్యమౌతుందని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పేర్కొన్నారు. నందివాడ, తుమ్మలపల్లి గ్రామాల్లో ఆక్వా రైతాంగానికి ప్రయోజనం చేకూరేలా సీఎం చంద్రబాబు ప్రవేశపెట్టిన ఆక్వా డిజిటల్ ట్రిసబులిటీ శిక్షణా కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వెనిగండ్ల రాము మాట్లాడుతూ నందివాడ ఆక్వా శిక్షణకు పైలెట్ ప్రాజెక్టు ఎంపిక కావటం, చాలా సంతోషకరంగా ఉందన్నారు. అత్యాధునిక ఆక్వా పద్ధతులపై శిక్షణ ఇవ్వడం వల్ల రైతులకు కలిగే ప్రయోజనాలను వివరించారు. మండలంలోని ఆక్వా శిక్షణకు మండలంలోని ఆరిపిరాల, రామాపురం, పుట్టగుంట, నందివాడ, తుమ్మలపల్లి, వెన్ననపూడి గ్రామాలు ఎంపిక య్యాయన్నారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో వ్యవసాయాన్ని గాలికొదిలేసి రైతన్నను రోడ్డుపాలు చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ రావి వెంకటేశ్వరరావు, టీడీపీ మండల అధ్యక్షుడు దానేటి సన్యాసిరావు, మార్కెట్ యార్డు చైర్మన్ చాట్రగడ్డ రవికుమార్, సీనియర్ టీడీపీ నాయకులు గొర్రి సత్యన్నారాయణ, ఎంపీడీవో మల్లేశ్వరి, నంబూరి రాకేష్, నిమ్మగడ్డ సత్యసాయి, అందుగుల ఏసుపాదం, రాధాకృష్ణ, సీతయ్య, ఏడుకొండలు, సతీష్, సాంబయ్య, మురళి, రైతులు పాల్గొన్నారు.



రైతులకు ప్రచార పత్రికలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

సుబ్రహ్మణ్యేశ్వరస్వామి షష్ఠి ఉత్సవాలకు ఏర్పాట్లు

గుడివాడ రూరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): పర్నాసలో వేంచేసి ఉన్న శ్రీవల్లీదేవసేన సమేత నాగ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి షష్ఠి ఉత్సవాలకు ఆలయ భక్తబృందం ఘనంగా ఏర్పాట్లు చేశారు. బుధవారం షష్ఠి ఉత్సవాలకు స్వామి ఆలయాన్ని అత్యంత అద్భుతంగా అలంకరించారు. గత 400 సంవత్సరాల క్రిందట స్వామివారు స్వయంభువుగా వెలిశారు. శ్రీవల్లీదేవసేన సమేత నాగ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కల్యాణ మహోత్సవం, విశాలాక్షి సమేత విశ్వేశ్వర స్వామి కల్యాణ మహోత్సవం ఏర్పాట్లకు భక్త బృందం సకల ఏర్పాట్లు చేశారు. ఈ ఉత్సవాన్ని తిలకించేందుకు రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు వస్తారు. 9 గంటల నుంచి స్వామి కల్యాణ ఉత్సవం వేలాది మంది మధ్య నిర్వహించనున్నారు. అనంతరం అన్నసమారాధన కార్యక్రమం నిర్వహిస్తారు. సాయంత్రం విద్యుత్ కాంతుల మధ్య తెప్పోత్సవం కన్నుల పండువగా నిర్వహించనున్నారు.



ఉత్సవాలకు సిద్ధమైన సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం

గుడివాడ : స్థానిక గౌరీశంకరస్వామి దేవస్థానం ఉపాలయమైన శ్రీవల్లీ దేవసేన సమేత అనంత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి షష్ఠి మహోత్సవాలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. షష్ఠి వేడుకల్లో భాగంగా కొనసాగుతున్న స్వామి దివ్యశాంతి కల్యాణ మహోత్సవాల్లో భాగంగా పలువురు భక్తులు పీటలపై కూర్చుని స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన కార్యనిర్వాహణాధికారి కందుల వేణుగోపాలరావు, ధర్మకర్తల కమిటీ చైర్మన్ నెరుసు సుభాష్ చంద్రబోసు, వేదపండితులు, భక్తులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలి

● ఎంఈవో బాలాజీ

గుడివాడ రూరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని ఎంఈవో బాలాజీ ఉపాధ్యాయులకు సూచించారు. మంగళవారం ఫాదర్ బియాంకి పాఠశాలలో ఉపాధ్యాయులు, సీఆర్పీలకు శిక్షణా తరగతులు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఆర్పీలు ఉపాధ్యాయులు సక్రమంగా బోధించటానికి తగిన వాతావరణం కల్పించి, వారు చక్కగా బోధించటానికి సహకరించాలని కోరారు. నందివాడ, పెదపారుపూడి, గుడివాడ , గుడ్లవల్లేరు, గన్నవరం, ఉంగుటూరు బాపులపాడు తదితర మండలాల ఎంఈవోల ఆధ్వర్యంలో శిక్షణా తరగతులు నిర్వహించారు. పాఠశాలకు సంబంధించి అన్ని విషయాలు ఆయా ప్రధానోపాధ్యాయులు సమాచారం అందించాలని కోరారు. ఎప్పటికప్పుడు రికార్డుల నిర్వహణ ప్రభుత్వ జీవోలు, లేటెస్ట్ అప్‌డేట్ సమాచారం అందించి ఎంఈవో కార్యాలయానికి అందించాలని కోరారు. ఎంఈవోలు డేవిడ్ రాజు, సురేష్, గోపాలరావు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈవో బాలాజీ

డ్వాక్రా గ్రూపులు సమర్థవంతంగా పనిచేయాలి

● ఎంపీపీ గద్దె పుష్పరాణి

గుడివాడ రూరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని డ్వాక్రా గ్రూపులు సమర్థవంతంగా పని చేయాలని ఎంపీపీ గద్దె పుష్పరాణి అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో గుడివాడ రూరల్ మండలానికి సంబంధించి మహిళా గ్రూపు లీడర్లు, గ్రామ సమైఖ్య లీడర్లు తదితరులతో వివిధ అంశాలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి గ్రామంలో సరిగా రికార్డుల నిర్వహణ, డ్వాక్రా మహిళలకు చక్కగా సేవలు అందించాలని తెలిపారు. ఎటువంటి అవినీతికి తావు లేకుండా విధులు నిర్వహించాలని కోరారు. ప్రతి గ్రామంలో ఎటువంటి ఇబ్బందులు ఉన్నా ఎంపీడీవోను, తనను సంప్రదించాలని తెలిపారు. డీఎల్‌డీవో సునీత శర్మ, ఎంపీడీవో విష్ణుప్రసాద్, డిప్యూటీ ఎంపీడీవో జి.శ్రీనివాసరావు, కార్యదర్శులు, రిసోర్సు పర్సన్లు పాల్గొన్నారు.



డ్వాక్రా గ్రూపు సభ్యులతో ఎంపీపీ గద్దె పుష్పరాణి



గరికపర్రులో రక్త నమూనాలు సేకరిస్తున్న సిబ్బంది

రక్త నమూనాల సేకరణ

తోట్లవల్లూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : యాకమూరు, గరికపర్రు, కనకవల్లి, పెనమకూరు గ్రామాల్లో సోమవారం రాత్రి బోధవ్యాధి(ఫైలేరియా) నిర్ధారణ పరీక్షల కోసం 600 మంది నుంచి రక్త నమూనాలను సేకరించినట్టు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ టి సాయిప్రసన్న తెలిపారు. ఈ రక్త నమూనాలను తోట్లవల్లూరు ల్యాబ్‌కు పంపి పరీక్షలు చేయిస్తామన్నారు. క్యూలెక్స్ దోమలు కుట్టటం వల్ల బోధవ్యాధి సంభవిస్తుందని, అందుచేత మురుగు నీరు నిల్వ లేకుండా చూడాలని ప్రజలను కోరారు. మురుగుపై గ్రామ పంచాయతీలు తగిన చర్యలు చేపట్టాలని డాక్టర్ సూచించారు. కార్యక్రమంలో సబ్ యూనిట్ ఆఫీసర్ జీవీవీ శ్రీనివాస్, ఎం రోహిణి, బి శారద, కె అనిల్‌కుమార్, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

వ్యక్తి కనిపించడం లేదని ఫిర్యాదు

గుడివాడ : స్థానిక నీలామహల్‌రోడ్డులో మున్సిపల్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగి నీలం జాని అలియాస్ పిచ్చయ్య, శ్రావణిలు నివాసముంటున్నారు. ఈనెల 11వ తేదీన భార్యభర్తల మధ్య వివాదం తలెత్తింది. ఈ క్రమంలో భర్త పిచ్చయ్య ఇంటి నుంచి వెళ్లిపోయాడు. బంధువులు, స్నేహితుల ఇళ్లలో ఎంత వెతుకులాడిన ఆచూకీ దొరకలేదు. దీంతో మంగళవారం భార్య శ్రావణి వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ హెడ్‌కానిస్టేబుల్ కిషోర్ తెలిపారు.

ఎస్టీయూ సభ్యత్వ నమోదు

గుడివాడ: ఎస్టీయూ పట్టణ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక ఏజీకే మున్సిపల్ ఉన్నత పాఠశాలలో ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి డి.చంద్రశేఖర్ ఆధ్వర్యంలో పలువురు ఉపాధ్యాయులకు సభ్యత్వాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు డానియేలు, ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు మరమ్మతు పనుల పరిశీలన

పమిడిముక్కల: వీరంకిలాకు నుంచి అగినపర్రు మీదుగా నారాయణపురం వెళ్లే రోడ్డు మరమ్మతు పనులను ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా పరిశీలించారు. పీ-4 పథకం ద్వారా బొబ్బాప్రకాశ్, చిగురుపాటి కృష్ణారావు రూ. 70వేలతో రోడ్డుమరమ్మతుపనులు చేయించడం అభినందనీయమన్నారు. వేసవిలో రోడ్డు అభివృద్ధిపనులు చేయనున్నామన్నారు.

గుడివాడ వాకర్స్ క్లబ్ నూతన కార్యవర్గం

గుడివాడ, నవంబరు25(ఆంధ్రజ్యోతి) : గుడివాడ వాకర్స్‌క్లబ్ 2026 నూతన కార్యవర్గ ఎన్నిక మంగళవారం జరిగింది. స్థానిక ఎన్టీఆర్ ఇండోర్ స్టేడియంలో గంటా చంద్రశేఖరరావు ఆధ్వర్యంలో సమావేశంలో క్లబ్ గౌరవాధ్యక్షుడు బాబు శ్రీకర్ నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. క్లబ్ నూతన అధ్యక్షుడిగా గంటా చంద్రశేఖరరావు ఎంపికయ్యారు. నూతన అధ్యక్షుడిని జిల్లా గవర్నర్ 204 సనకా సుబ్బారావు, మాజీ గవర్నర్లు తిరుపతయ్య, పి.రామకృష్ణ, ప్రస్తుత అధ్యక్షుడు డీవీ సత్యనారాయణ, తదితరులు అభినందించారు.



సమావేశంలో మాట్లాడుతున్న బాబూ శ్రీకర్

శాంతి వృద్ధాశ్రమంలో అన్నదానం

గుడివాడ, నవంబరు25(ఆంధ్రజ్యోతి) : స్థానిక శాంతి వృద్ధాశ్రమంలో వైసీపీ నాయకులు వల్లూరుపల్లి సుధాకర్ జన్మదినం సందర్భంగా నాయకులు కొంకితల ఆంజనేయప్రసాద్ ఆధ్వర్యంలో మంగళవారం వృద్ధులకు భోజన వసతి కల్పించారు. తొలుత కేకును కట్‌చేసి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు తోట రాజేష్, ధనాల ఫణి, షేక్ బాజీ, హారిక, రమీజా, సురేఖ, తుమ్మలపల్లి ప్రసాద్ పాల్గొన్నారు.

తడి, పొడిచెత్తపై అవగాహన తప్పనిసరి

● ఎంపీడీవో జ్యోతి



పామర్రులోని చెత్తసంపద కేంద్రం వద్ద ..

పామర్రు,నవంబరు25(ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిశుభ్రతను ప్రతి ఒక్కరూ స్వీకరించి ఆరోగ్యవంతమైన సమాజస్థాపనలో భాగస్వాములుగా నిలవాలని ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్, ఎంపీడీవో కాండ్రు జ్యోతి అన్నారు. మంగళవారం పామర్రులోని చెత్తసంపద కేంద్రంలో మహిళా సంఘ సభ్యులకు, క్లాప్ మిత్రలకు తడి, పొడి చెత్త సేకరణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజల ఇళ్లకు పంచాయతీల ద్వారా అందించిన చెత్తబుట్టలలో తడి, పొడి చెత్తను విడిగా తీసి ఉంచాలన్నారు. రీసైక్లింగ్ విధానానికి ప్రజలంతా బాధ్యతగా సహకరించేలా డ్వాక్రాసంఘాలు ప్రోత్సహించాలని కోరారు. డిప్యూటీ ఎంపీడీవో జనార్దనరావు, వెలుగు ఏపీఎం తిరుపతిరావు, వైస్ ఎంపీపీ రమాదేవి, మహిళా సంఘాల అధ్యక్షురాలు వరలక్ష్మి పాల్గొన్నారు.

తోట్లవల్లూరు : తడి, పొడి చెత్తను విడి విడిగా పంచాయతీ వ్యానుల్లో వేసే బాధ్యత మహిళలపై ఉందని, ఇందుకు ప్రతి డ్వాక్రా మహిళా తన ఇంటిలో అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని ఎంపీడీవో రవికాంత్ వివరించారు. తోట్లవల్లూరు మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం డ్వాక్రా మహిళలు, బుక్ కీపర్లకు తడి, పొడి చెత్త సేకరణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పంచాయతీ నుంచి వచ్చే వ్యానుల్లో ప్రజలు తడి, పొడి చెత్తను కలిపి వేయటంతో దీని లక్ష్యం దెబ్బతింటోందన్నారు. దీనిపై డ్వాక్రా మహిళలు చైతన్యం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. డిప్యూటీ ఎంపీడీవో వెంకటేశ్వరమ్మ, సూపరింటెండెంట్ ఉదయ్‌భాస్కర్, రిసోర్స్ పర్సన్ నాగమల్లేశ్వరరావు, వెలుగు ఏపీఎం సాంబశివరావు పాల్గొన్నారు.



తోట్లవల్లూరులో ..



పెదపారుపూడిలో..

పెదపారుపూడి : వెలుగు మహిళల భాగస్వామ్యంతోనే గ్రామాల్లో ప్రభుత్వం ఆశించిన మార్పులు సాధ్యమవుతుందని పెదపారుపూడి ఎంపీడీవో జె.విమాదేవి పేర్కొన్నారు. పెదపారుపూడి మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో వెలుగు వీవోఏలు, డ్వాక్రా మహిళలు, కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్లకి క్లీన్ అండ్ గ్రీన్ విలేజ్ థీమ్-5 అంశంపై ఒక రోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామాల్లో పచ్చదనం పరిశుభ్రతల ఆవశ్యకతపై అవగాహనకల్పించడమే ఈ శిక్షణ ముఖ్యఉద్దేశ్యం అని తెలిపారు. డిప్యూటీ ఎంపీడీవో వంగా శ్రీనివాస్ మాట్లాడుతూ ఇంటి వద్దనే చెత్త విభజన చేయటం అందరూ చేసే విధంగా ఇంటింటికి అవగాహన కల్పించాలన్నారు. జమిదింటకుర్రు సెక్రటరీ కృష్ణవేణి, గురువిందగుంట సెక్రటరీ విజయ్ కుమార్ ట్రైనర్స్‌గా వ్యవహరించారు. వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

మచిలీపట్నం

• మచిలీపట్నం • పెడన • అవనిగడ్డ

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	122, 131, 142
చికెన్ విత్ స్కిన్	232
చికెన్ స్కిన్‌లెస్	242

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 660

విద్యారంగ సమస్యలను పరిష్కరించాలి : ఎస్ఎఫ్ఐ

మచిలీపట్నం టౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ నాయకుడు సమరం డిమాండ్ చేశారు. జ్యోతీరావుపూలే విజ్ఞాన కేంద్రంలో ఎస్ఎఫ్ఐ మచిలీపట్నం మండల మహాసభ జరిగింది. సమరం మాట్లాడుతూ, డిగ్రీ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వాలని, జీవో 77ను రద్దు చేసి పీజీ విద్యార్థులకు రాయితీలు అందించాలన్నారు. మచిలీపట్నంలో ప్రభుత్వ డిగ్రీ, జూనియర్ కళాశాలను ఏర్పాటు చేయాలన్నారు. మచిలీపట్నం ఎస్ఎఫ్ఐ కమిటీని ఏర్పాటు చేశారు. మండల అధ్యక్షుడుగా ఎండి బషీర్, కార్యదర్శిగా బి.పూజిత, ఉపాధ్యక్షులుగా ఎండి క్యూజాఫ్, జి.శివసాయికృష్ణ, జె. భువన్, మణికంత, సహాయ కార్యదర్శులుగా పి.హర్ష, కె. లక్ష్మీనరసింహస్వామి, వై.చెర్రిలను ఎన్నుకున్నారు.



మండల సమైక్య ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహిస్తున్న మహిళలు

మహిళలపై అత్యాచారాలు, వేధింపులు నిరోధించాలి

పెడన రూరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : మహిళలపై అత్యాచారాలు, వేధింపులు అరికట్టాలని, స్త్రీలను గౌరవించాలని కోరుతూ మండల పరిషత్ కార్యాలయంనుంచి మహిళలు ర్యాలీ నిర్వహించారు.వెలుగు, మండల సమైక్య ఆధ్వర్యంలో మహిళలు పాల్గొన్నారు. లింగ వివక్షతకు తావివ్వరాదని, అందరూ సమానమని ప్రభుత్వాలు చెపుతున్నా సమాజంలో అక్కడక్కడా మహిళలపై దాడులు జరగుతున్నాయని ఏపీఎం శ్రీదేవి అన్నారు. అర్జా నాగమణి, అనురాధ, తులసిబాల, ప్రమీల పాల్గొన్నారు.

వైసీపీ కోటి సంతకాల సేకరణ



అవనిగడ్డ రూరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు మంగళ వారం కోటి సంతకాల సేకరణ కార్యక్రమం పులిగడ్డలోని దుకాణాలను సందర్శించి, పులిగడ్డ చౌరస్తా వద్ద టెంటు వేసి సంతకాలు సేకరించారు. సర్పంచ్ దాసరి విజయ్ కుమార్, వైస్ ఎంపీపీ పులిగడ్డ పిచ్చేశ్వరరావు, పార్టీ నేతలు సింహాద్రి వెంకటేశ్వరరావు, రేపల్లె శ్రీనివాసరావు, చింతలపూడి బాలు, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు నలుకుర్తి రమేష్, పాల్గొన్నారు.

కాగిత వెంకటేశ్వరరావుకు రామకృష్ణ అభినందన

మచిలీపట్నం టౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : బందరు రూరల్ మండల అధ్యక్షుడిగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన కాగిత వెంకటేశ్వరరావును మంగళవారం రాత్రి డీసీఎంఎస్ చైర్మన్ బండి రామకృష్ణ సత్కరించారు. చిన్నాపురంలో కాగితను సత్కరించి అభినందించారు.



కాగితను అభినందిస్తున్న బండి రామకృష్ణ



స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న రవిశంకర్ - రమ్యవల్లి, రఘునందన్-హిమజ దంపతులు



జగాజ్యోతిని వెలిగిస్తున్న కోనేరు మురళీధర్ - రమా శిరీష దంపతులు

వైభవంగా సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణం

● నేత్రపర్వంగా జగాజ్యోతి
● తిలకించి తరించిన భక్తజనం

ఘంటసాల, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : ఘంటసాలలో శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కల్యాణం మంగళవారం రాత్రి వైభవంగా జరిగింది. ఘంటసాల కరణం ఘంటసాల రాధాకృష్ణమూర్తి కుటుంబ సభ్యులు పమిడిపాటి రవిశంకర్-రమ్యవల్లి , ఉంగుటూరి రఘునందన్-హిమజ దంపతులు స్వామివారి కల్యాణ మహోత్సవం నిర్వహించారు.

ఉదయం దేవాలయంలో ప్రత్యేక పూజలు జరిపారు. బిందె తీర్థం, స్వామివారిని పెండ్లి కుమారుని చేయుట, గ్రామ బలిహరణ, నిత్య విధి కార్యక్రమాలను అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అర్చకులు చావలి కృష్ణకిషోర్ ఆధ్వర్యంలో కోనేరు మురళీధర్ - రమా శిరీష దంపతులచే దేవాలయ ప్రాంగణంలో విశేష పూజలు జరిపారు. సాయంత్రం 6.15 నిముషాలకు వేదపండితుల మంత్రోచ్ఛరణ నడుమ జగాజ్యోతిని వెలిగించారు. కల్యాణ మహోత్సవ వేడుకలను ఆలయ ధర్మకర్తలు గొర్రెపాటి వెంకట రామకృష్ణ, గొర్రెపాటి జగన్మోహనరావు, గొర్రెపాటి సురేంద్ర పర్యవేక్షించారు.

జగన్నాథస్వామి దేవస్థానం పాలక మండలి ప్రమాణ స్వీకారం రేపు

మచిలీపట్నం టౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : మచిలీపట్నంలో 600 సంవత్సరాల చరిత్ర కలిగిన జగన్నాథ స్వామి దేవస్థానం ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకార కార్యక్రమం 27న జరుగుతుందని జనసేన నగర అధ్యక్షుడు గడ్డం రాజు, జనసేన కార్పొరేటర్ పినిశెట్టి ఛాయాదేవి తెలిపారు. ఆహ్వానపత్రికలను మంగళవారం ఆలయ ధర్మకర్తల మండలి ఆవిష్కరించారు. జనసేన పార్టీకి చెందిన గంపల దుర్గాభవాని చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేస్తారన్నారు.



ప్రమాణస్వీకారోత్సవ ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న దేవస్థానం పాలక మండలి సభ్యులు, జనసేన నేతలు

పైడమ్మకు షాపుల వేలంపాట ఆదాయం రూ.12.13లక్షలు

● గత ఏడాది కంటే పెరిగిన ఆదాయం

పెడన, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : డిసెంబరు 4 నుంచి 14 వరకు జరగనున్న పెడన పైడమ్మ జాతర ఉత్సవాలలోగూడూరు రోడ్డుకు ఇరువైపులా అంగళ్లు ఏర్పాటు చేసుకునే వ్యాపారుల నుంచి రుసుము వసూలు హక్కుకు పురపాలక సంఘ కార్యాలయ ఆవరణలో మంగళవారం బహిరంగ వేలం నిర్వహించారు.

గుత్తేదారులు రౌతుల ప్రసాద్, ఎలిగట్ల ప్రసాద్, అబ్దుల్ హై, చిరివెళ్ల శివప్రసాద్, రౌతుల రాధాకృష్ణ, వాజ్‌దున్నీసా ఈ వేలంలో పాల్గొన్నారు. ఎలిగట్ల ప్రసాద్ రూ. 12 లక్షల 13వేలకు అందరికన్నా హెచ్చుపాట పాడి ఉత్సవ ప్రాంగణంలో, గూడూరు రోడ్డుకు ఇరుపక్కలా అంగళ్లు ఏర్పాటు చేసుకునే వ్యాపారుల నుంచి రుసుము వసూలు చేసుకునే హక్కును దక్కించుకున్నారు.

వేలం ద్వారా గత ఏడాది మునిసిపాలిటీకి రూ. 11 లక్షల ఆదాయం రాగా, ఈ ఏడాది రూ. 12లక్షల 13వేల ఆదాయం లభించింది. ఇన్‌చార్జి కమిషనర్ కాగిత రామాంజనేయులు పర్యవేక్షణలో మేనేజర్ మట్టా రాజా, ఇన్‌చార్జి రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రాజేష్, సీనియర్ అసిస్టెంట్లు కృష్ణయ్య, సుబ్రహ్మణ్యం వేలం నిర్వహించారు.



జాతీయ కబడ్డీ పోటీలకు మౌనిక

నాగాయలంక, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): తలగడదీవి విద్యార్థిని కె.మౌనిక జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైంది. మచిలీపట్నం నోబుల్ కళాశాలలో నిర్వహించిన 69వ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో కె.మౌనిక బెస్ట్ ప్లేయర్ అవార్డును సొంతం చేసుకుని జనవరిలో జరిగే జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయిందని పాఠశాల హెచ్ఎం బంద్రెడ్డి శివరామ ప్రసాద్ తెలిపారు. విద్యార్థిని మౌనికను పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ వర్రే రాంబాబు, పాఠశాల ఎస్ఎంసీ చైర్మన్ మోహన్ లాల్, సర్పంచ్ భోగాది వెంకటేశ్వరరావు, శిక్షణ ఇచ్చిన పీడీ ప్రసాద్‌ను విద్యాకుటుంబం అభినందించారు.



జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఉస్మిత

పులివెందులలో జరిగిన రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో నాగాయలంక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని సబ్బినేని ఉస్మిత ప్రతిభ కనబర్చి జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు అలపర్తి సత్యనారాయణ తెలిపారు. జనవరి 3వ తేదీన న్యూ ఢిల్లీలో జరిగే జాతీయ సాఫ్ట్‌బాల్ పోటీల్లో ఆమె పాల్గొంటుందని తెలిపారు. జాతీయ స్థాయికి ఎంపికైన విద్యార్థిని ఉష్మితని ఎస్ఎంసీ చైర్‌పర్సన్ వక్కపట్ల లీలా మారుతి, ఫిజికల్ డైరెక్టర్స్ జి.లక్ష్మీ ప్రసాద్, కె.శివాజీ అభినందించారు.



వెంకటాపురం రైతు సేవా కేంద్రంలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ తెలుసుకుంటున్న ఎమ్మెల్యే బుద్ధప్రసాద్



రైతులకు విత్తనాలు అందజేస్తున్న ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్



రైతన్నా..మీకోసం కరపత్రాలు అందజేస్తున్న గోపు

ధాన్యం కొనుగోలు వేగవంతం చేయండి

మోపిదేవి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ ధాన్యం కొనుగోలు ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అధికారులకు సూచించారు. రావివారి పాలెం, వెంకటాపురం, పెదకళ్లేపల్లి గ్రామాల్లో ఎమ్మెల్యే మండలి మంగళవారం పర్యటించి ధాన్యం కొనుగోలు ప్రక్రియను పరిశీలించారు. రావివారిపాలెంలోని రైసు మిల్లు వద్దకు వెళ్లి ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్న విధానాన్ని మిల్లు యాజమాన్యాన్ని అడిగి తెలుసుకున్నారు. వెంకటాపురం, పెదకళ్లేపల్లిలోని రైతు సేవా కేంద్రాల్లో కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించి రైతులను స్వయంగా ధాన్యం కొనుగోలు ప్రక్రియపై ఆరా తీశారు. బీపీటీ ధాన్యం కొనుగోలుపై వస్తున్న వదంతులను నమ్మొద్దన్నారు. అన్ని రకాల ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. వాతావరణ పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని ధాన్యం కొనుగోలు ప్రక్రియ మరింత వేగవంతం చేయాలన్నారు. అవనిగడ్డ నియోజకవర్గంలో 1,04,064 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యం కాగా, ఇప్పటి వరకు 1,037 మంది రైతుల నుంచి రూ.16.89 కోట్ల విలువైన 7,468 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు తెలిపారు. సచివాలయ ఉద్యోగులతో కలసి రైతన్న మీ కోసం కరపత్రాలను అందించి ప్రభుత్వ లక్ష్యాలను రైతులకు తెలియజేశారు. తహసీల్దార్ ఎం.హరనాథ్, ఏవో హెబ్సిబా రాణి, వెంకటాపురం సర్పంచ్ తుమ్మ సోములమ్మ, పీఏసీఎస్ చైర్ పర్సన్లు పరుచూరి శ్రీనివాసరావు, అరజా రాధిక తదితరులు పాల్గొన్నారు.

రైతు శ్రేయస్సుకు కృషి : కాగిత

కృత్తివెన్ను : రైతన్నా మీ కోసం కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ కృత్తివెన్ను వ్యవసాయ కార్యాలయాన్ని సందర్శించారు. వ్యవసాయ అధికారులు రైతులకు అందుబాటులో ఉంటారని, ప్రతి సమస్య పరిష్కారం దిశగా సూచనలు చేస్తారన్నారు. ప్రకృతి వ్యవసాయం వైపు రైతులు ఆసక్తి చూపాలన్నారు. చిరు ధాన్యాల సాగుపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. రైతులకు రాయితీపై విత్తనాలను అందించారు. మార్కెట్ యార్డు చైర్మన్ ఒడుగు తులసీరావు, డీసీ చైర్మన్ నెక్కంటి భాస్కరరావు, వైస్ డీసీ చైర్మన్ బొర్రా ఏడుకొండలు, పీఏసీఎస్ అధ్యక్షుడు కూనసాని నాగబాబు, మండల పార్టీ అధ్యక్షుడు నాగిడి చెన్నకేశవరావు, కార్యదర్శి యాదంరెడ్డి కొండ, కొమాళ్లపూడి నీటి సంఘం అధ్యక్షుడు కూనసాని శ్రీనివాసరావు, నాయకులు చేకూరి వెంకట్రావు, కూనసాని చిన్న తదితరులు పాల్గొన్నారు.

రైతును రాజు చేయటమే లక్ష్యం

అవనిగడ్డ రూరల్ : కూటమి ప్రభుత్వం రైతుల సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తూ అనేక కార్యక్రమాలు చేపడుతోందని దివి మార్కెట్ కమిటీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చే లక్ష్యంతో కూ టమి ప్రభుత్వం చేపట్టిన రైతన్నా మీ కోసం కార్యక్రమాన్ని మంగళవారం అశ్వారావుపాలెం గ్రామంలో ప్రారంభించారు. ప్రభుత్వం రైతులకు అందిస్తున్న వివిధ సంక్షేమ పథకాలను రైతులకు వివరించారు. అనంతరం ప్రచార కరపత్రాలను అన్నదాతలకు అందించారు. దివి వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి శ్రీనివాసరావు, వ్యవసాయ శాఖ ఏవో శుభహారిక, నీటి సంఘాల అధ్యక్షులు దాసినేని శ్రీనివాసరావు, గ్రామ మాజీ సర్పంచ్ కొండవీటి మధు, దాసినేని సాంబయ్య, రేపల్లె నాగబాబు, కొండవీటి రవి, గ్రామ రైతులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమానికి ప్రాధాన్యం

మచిలీపట్నం టౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : రైతు సంక్షేమానికి కూటమి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ గోపు సత్యనారాయణ అన్నారు.

కానూరు గ్రామంలో మంగళవారం రైతన్నా మీ కోసం అవగాహనా సదస్సు జరిగింది. గోపు సత్యనారాయణ మాట్లాడుతూ, ధాన్యం కొనుగోలు చేసిన 48 గంటల్లో వారి ఖాతాలకు సొమ్ము జమ అవుతుందన్నారు. డ్రిప్ ఇరిగేషన్‌పై సబ్సిడీపై ఇస్తామన్నారు. బిందు సేద్యంతో ఖర్చు తగ్గి దిగుబడి పెరుగుతుందన్నారు. భూసార పరీక్షలు నిర్వహిస్తూ ఆధునిక పద్ధతులపై రైతులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. డ్రోన్ల వినియోగం, యాంత్రీకరణపై దృష్టి సారించాలన్నారు సెక్రటరీ శ్రీహరి, వీఆర్వో సుబ్బయ్యదాసు, దివి మహేష్, గోపు వెంకటరమణ, సిద్ధిరెడ్డి పాండురంగారావు, బోట్ల రాజేష్, మాడబోయిన వెంకటాచలం తదితరులు పాల్గొన్నారు. సుల్తానగరంలో జరిగిన రైతన్నా మీ కోసం కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ కుంచే నాని పాల్గొన్నారు.



మల్లవోలులో రైతులకు పరదాల పంపిణీ

గూడూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : మల్లవోలు గ్రామంలోని రైతులకు అధికారులు రైతులకు పరదాలను పంపిణీ చేశారు. ముద్దినేని వెంకటేశ్వరరావు, బాసంశెట్టి శ్రీనివాసరావు, బత్తిన వీరబాబు, అల్లు బాల, పూల నాగరాజు, గణేష్, జరుగు కృష్ణమ్మ తదితరులు పాల్గొన్నారు.

బీపీఎల్‌తో భవనాలను క్రమబద్ధీకరించుకోవాలి

●కమిషనర్ రామాంజనేయులు

పెడన, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : బిల్డింగ్ పీనలైజేషన్ స్కీమ్ (బీపీఎస్) కింద మునిసిపల్ అనుమతి లేకుండా నిర్మించిన భవనాలు, ఆమోదించిన ప్లాన్ కు విరుద్ధంగా నిర్మించిన భవనాలను క్రమబద్ధీకరించుకోవాలని ఇన్‌చార్జి కమిషనర్ కాగిత రామాంజనేయులు సూచించారు. 1-1-1985 నుంచి 31-8-25 మధ్య నిర్మించిన భవనాలకు మాత్రమే బీపీఎస్ వర్తిస్తుందని ఆయన స్పష్టం చేశారు. ఈ స్కీమ్‌ను మునిసిపాలిటీ పరిధిలోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. భవనాల క్రమబద్ధీకరణ దరఖాస్తుతో పాటు రూ. 10 వేల రుసుము చెల్లించాలన్నారు. మార్చి 13, 2026లోగా పెనాలిటీ మొత్తాన్ని చెల్లించి భవనాలను క్రమబద్ధీకరించుకోవాలన్నారు. లే అవుట్ క్రమబద్ధీకరణ స్కీమ్‌కు దరఖాస్తుల స్వీకరణకు గడువు తేదీని ప్రభుత్వం మరో మూడు నెలలపాటు పొడిగించిందన్నారు. పెడన మునిసిపాలిటీలోని ప్రజలు తమ అనుమతిలేని లే అవుట్లు, ప్లాట్లను క్రమబద్ధీకరించుకోవాలని ఆయన సూచించారు.



యార్లగడ్డలో ఎలక్ట్రానిక్ కాటాలను తనిఖీ చేస్తున్న తూనికలు కొలతల శాఖ అధికారులు

తూనికలు కొలతల శాఖ తనిఖీలు

చల్లపల్లి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : తూనికల కొలతల శాఖ అధికారులు మంగళవారం తనిఖీలు చేపట్టారు. గ్రామాల్లో వరికోతలు ముమ్మరంగా జరుగుతున్న నేపథ్యంలో ధాన్యం విక్రయ సమయాల్లో కాటాల్లో మోసాలను నిరోధించే క్రమంలో అధికారులు తనిఖీలు చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో ముఠా మేస్త్రీలు వేసే కాటా ల్లో తేడాలుంటున్నట్లు రైతాంగం నుంచి ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో తనిఖీలు చేసి ఎలక్ట్రానిక్ కాటాలను సరిచూశారు. చల్లపల్లి మండలం యార్లగడ్డ, వక్కలగడ్డ, చల్లపల్లి తదితర గ్రామాల్లో ముఠా మేస్త్రీలు వేసే కాటాలు, రైస్‌మిల్లులు, ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కాటాలను తూనికల కొలతల శాఖ అధికారులు తనిఖీ చేశారు. కాటాల్లో ఎలాంటి తేడాలను గమనించలేదని అధికారులు తెలిపారు. జిల్లా తూనికల కొలతల శాఖ ఇన్‌స్పెక్టర్ ఈశ్వరరావు, పీడీఎస్ డీటీ శ్రీనివాసరావు, చల్లపల్లి ఏవో కె.మురళీకృష్ణ, సొసైటీల సీఈవోలు, వీఆర్వోలు పాల్గొన్నారు.



పేదలకు ఆర్థిక సాయం అందజేస్తున్న టీడీపీ సీనియర్ నేత గొర్రెపాటి గోపీచంద్

బెరాకా మినిస్ట్రీస్ సేవలు అభినందనీయం

మచిలీపట్నం టౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : పేదలను ఆదుకోవడంలో ఎంతో సంతృప్తి ఉంటుందని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గొర్రెపాటి గోపీచంద్ అన్నారు. బెరాకా మినిస్ట్రీస్ అధినేత కిరణ్‌పాల్ ఆధ్వర్యంలో మంగళవారం 38 మంది పేద విద్యార్థులకు వైద్య ఖర్చుల నిమిత్తం రూ. 11 లక్షల 10వేల విలువ గల చెక్కులను గోపీచంద్ అందజేశారు. గోపీచంద్ మాట్లాడుతూ, బెరాకా మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో కులమతాలకు అతీతంగా సమాజంలోని పేదలను ఆదుకుంటున్నారన్నారు. మానవసేవే మాధవసేవగా భావిస్తూ కిరణ్‌పాల్ వేలాది నిరుపేదలకు సాయం అందిస్తున్నారన్నారు. బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ పి.వి. ఫణికుమార్, టీడీపీ నాయకులు లోగిశెట్టి వెంకటస్వామి, చిన్నం శివనాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాలు పరిశుభ్రంగా ఉండాలి

పెడన రూరల్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి) : ప్రజలు ఆరోగ్యవంతమైన జీవనం సాగించేందుకు గ్రామాలు పరిశుభ్రంగా ఉండాలని ఎంపీడీవో అరుణ కుమారి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో పచ్చదనం-పరిశుభ్రత మనందరి బాధ్యత అనే అంశంపై పొదుపు సంఘాల లీడర్లు, పంచాయతీ కార్యదర్శులతో శిక్షకులు యుగంధర్, రవికిరణ్‌లు శిక్షణాతరగతులు నిర్వహించారు. గ్రామాలలో చెత్త సేకరణ సమయంలో తడిచెత్త, పొడి చెత్త వేర్వేరుగా సేకరించి, సంపద తయారీ కేంద్రాలకు తరలించాలన్నారు. పొదుపు సంఘ సభ్యులు ఇంటింటి ప్రచారం నిర్వహించి స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్-స్వర్ణాంధ్రప్రదేశ్ నిర్మాణంలో భాగస్వాములు కావాలన్నారు. డిప్యూటీ ఎంపీడీవో నాగిరెడ్డి, ఏపీఎం శ్రీదేవి, మండల మహిళా సమైక్య అధ్యక్షురాలు అర్జా నాగలక్ష్మి, సీసీలు తులసిబాల, సుజాత, అనురాధ, పర్హతుల్లా, పాల్గొన్నారు.

పౌష్టికాహార కిట్లు ఇప్పించాలని వినతి

కోడూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): అంగన్వాడీ కేంద్రాల్లో బాలింతలు, గర్భిణులకు అందించే పౌష్టికాహారం కిట్లు రెండు నెలల నుంచి రావటం లేదని అంగన్వాడీ టీచర్లు తహసీల్దార్ సౌజన్య కిరణ్మయికి తెలిపారు. అంగన్వాడీలకు కందిపప్పు, పామాయిల్, బియ్యం ప్యాకెట్లు రావటం లేదన్నారు. డీలర్లను అడిగితే రాలేదని చెబుతున్నారన్నారు. వెంటనే పౌష్టికాహార కిట్లు అందించాలని కోరారు. అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.